PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 152 | విజయవాడ, సోమవారం 2 జనవరి 2023 | 6 + 8 పేజీలు వెల : రూ. 5. 50

Vol No | Vijayawada, Monday 2 January 2023 | Rs

దేశంలో నిరుద్యోగ విజృంభణ

- డిసెంబర్‌లో 16 నెలల గరిష్టానికి
- నిరుద్యోగ రేటు 8.30 శాతంగా నమోదు

● లోపలి పేజీలో.. ●

మళ్లీ తొక్కిసలాట

● టిడిపి చంద్రన్న కానుక పంపిణీలో ముగ్గురు మృతి ● మరో ఇద్దరు మహిళల పరిస్థితి విషమం ● చంద్రబాబు ప్రసంగించి వెళ్లాక దుర్ఘటన

సంఘటనా స్థలంలో మృతి చెందిన రమాదేవి

మహిళను ఆస్పత్రికి తరలించే ప్రయత్నంలో తోటి మహిళలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లాప్రతినిధి

నెల్లూరు జిల్లా కందుకూరులో జరిగిన దుర్ఘటనను మరవకముందే మళ్లీ అటువంటి విషాదమే గుంటూరు జిల్లాలో చోటుచేసుకుంది. తెలుగుదేశం పార్టీ ఎన్‌ఆర్‌ఐ సెల్, ఉయ్యూరు ఫౌండేషన్ పేదల కోసం చేపట్టిన కానుకల పంపిణీ కార్యక్రమంలో తీవ్రస్థాయిలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ముగ్గురు మరణించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మరో 11 మందికి గాయాలయ్యాయి. ఈ దుర్ఘటనలో మృతి చెందిన వారు, గాయపడిన వారు అందరూ మహిళలే. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రసంగించి సభ నుంచి వెళ్లిన తరువాత ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మృతులను గోపిదేశి రమాదేవి (52), షేక్ మస్తాన్ బీ (40), సయ్యద్ హాసియా (34)గా గుర్తించారు. అనూహ్యంగా చోటుచేసుకున్న ఈ సంఘటన పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపాన్ని, వారి కుటుంబాలకు సానుభూతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల ఆర్థిక సాయాన్ని ఉయ్యూరు ఫౌండేషన్ ప్రకటించింది. తెలుగుదేశం పార్టీ రూ.5 లక్షలను, రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షలను సాయంగా ప్రకటించింది. గాయపడిన వారిని అన్ని విధాలా ఆదుకుంటామని ఉయ్యూరు ఫౌండేషన్ తెలపగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.50 వేల పరిహారాన్ని ప్రకటించింది. గుంటూరు టిడిపి నాయకులు కోవెలమూడి రవీంద్ర, డేగల ప్రభాకర్ కలిపి రూ.3 లక్షలు చొప్పున సాయం ప్రకటించారు.

ఇలా జరిగింది....

తెలుగుదేశం ఎన్‌ఆర్‌ఐ సెల్, ఉయ్యూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు ఎన్‌టిఆర్ జనతా వస్త్రాలు, చంద్రన్న కానుకల పేరిట ఆదివారం చీరలు, నిత్యావసర వస్తువుల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంపై గుంటూరు నగరంలో విస్తృతంగా ప్రచారం చేశారు. దీంతో పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. ప్రకటించిన సమయానికన్నా కొన్ని గంటలు ఆలస్యంగా కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ప్రసంగించి, కొంతమందికి కానుకలు అందించి సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో వెళ్లిపోయారు. అనంతరం నిర్వాహకులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అప్పటికే ఆలస్యం కావడం, మరోవైపు పెద్ద సంఖ్యలో జనం ఉండటంతో అందరికీ సరిపడా కానుకలు ఉన్నాయో లేవోనన్న చర్చ ప్రారంభమైంది. అదే సమయంలో నిర్వాహకులు 'ఉన్న మేరకు కానుకలు పంచుతామని, మిగిలిన వారికి సోమవారం ఇస్తాం' అని ప్రకటించినట్లు చెబుతున్నారు. దీంతో పంపిణీ ప్రారంభం కాగానే పంపిణీ కోసం ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్దకు తోసుకుపోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఏర్పాటుచేసిన బ్యారికేడ్లు నేలకూలాయి. ఏం జరుగుతోందో అర్థం చేసుకునే లోపలే పరిస్థితి చేయిదాటింది. ఒకరిపై

మిగతా 2లో

కలచివేసింది : సిఎం

గుంటూరులో జరిగిన తొక్కిసలాట దుర్ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. ఈ ఘటనలో ముగ్గురు మరణించడం తనను కలచివేసిందన్నారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు

బాధాకరం : చంద్రబాబు

పేదలకు ఆ స్వచ్ఛంద సంస్థ చేసే కార్యక్రమాన్ని ప్రోత్సహించాలి అనే ఆలోచనతో తాను ఆ కార్యక్రమానికి వెళ్లానని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. దుర్ఘటన జరిగి ముగ్గురు చనిపోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు.

ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలం : సిపిఎం

కందుకూరు ఘటన మరవకముందే అదే తరహా దుర్ఘటన జరగడం బాధాకరమని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు విడుదల చేసిన ప్రకటనలో కొన్ని వేల మంది వస్తున్నప్పుడు తగిన ముందస్తు చర్యలు, జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రభుత్వం, పోలీసులు, ఇంటిలిజెన్స్ పూర్తిగా వైఫల్యం చెందినట్లు కనిపిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి జాగ్రత్తలు తీసుకోకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని తెలిపారు. మరణించిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, రూ.25లక్షల నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి కార్యక్రమాల నిర్వహణలో పార్టీలు, సంస్థలు, ప్రజలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

సిటీ◆

భీమా కోరెగావ్ అమరవీరులకు నివాళులర్పించేందుకు భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజానీకం.

భీమా కోరెగావ్‌కు పోటెత్తిన జనం

పుణే : మహారాష్ట్రలో పుణేలోని భీమా కోరెగావ్ యుద్ధ స్మారకం వద్దకు ఆదివారం నాడు ప్రజానీకం పోటెత్తారు. 205వ వార్షిక దినాన్ని పాటించేందుకు దళితులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమరవీరులకు నివాళులర్పించారు. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి, మరాఠా పేష్వాలకు మధ్య 1818 జనవరి 1న జరిగిన యుద్ధంలో సాధించిన విజయానికి ప్రతీకగా ప్రతి యేటా నివాళులర్పించడం ఆనవాయితీగా వస్తోంది. కోరేగావ్ భీమా గ్రామాన్ని సందర్శించి అమరవీరులకు నివాళులర్పించేందుకు ముందు వీరంతా 'జై స్థంభ్' (విజయస్థూపం) వద్ద సమావేశమవుతారు. 2018 జనవరి 1న ద్విశతాబ్ది వేడుకల సందర్భంగా హింస చెలరేగిన సంగతి తెలిసిందే. నాటి ఘటనలో ఒకరు చనిపోగా పలువురు గాయపడ్డారు. పోలీసులు 58 కేసులు బనాయించి 162 మందిని అరెస్టు చేశారు. ఇదే ఘటనను సాకుగా చేసుకొని పదుల సంఖ్యలో సామాజిక, ఆదివాసీ కార్యకర్తలను, పౌర హక్కుల నేతలను కూడా వివిధ కేసుల్లో కుట్రపూరితంగా ఇరికించి కేంద్రంలోని మోడీ సర్కార్ తీవ్రస్థాయిలో వేధింపులకు గురి చేసిన సంగతి విదితమే. సంఘ్ పరివార్ మూకలే ఉద్దేశ్యపూర్వకంగా రాళ్లు రువ్వి హింస రాజేసిన సంగతి వివిధ స్వతంత్ర దర్యాప్తు సంస్థల పరిశోధనలో తేలింది. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న రచయిత పి వరవరరావుకు సుప్రీంకోర్టు గతేడాది ఆగస్టు 10న చికిత్స కోసం బెయిల్ మంజూరు చేసింది. 2018 ఆగస్టు 28న ఆయనను అరెస్టు చేశారు. ఉపాతో పాటు ఐపిసిలోని అనేక సెక్షన్ల కింద ఆయనపై అభియోగాలు మోపారు. మరో నిందితుడిగా ఉన్న గౌతం నవలఖకు గృహ నిర్బంధంలో ఉంచేందుకు అనుమతిస్తూ 2022 నవంబరు 10న సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. మరోవైపు వీరిపై బనాయించిన కేసులన్నీ కుట్రపూరితంగా బనాయించినవేనని, వారి కంప్యూటర్లలోకి చొరబడి తప్పుడు సాక్ష్యాలు జొప్పించారని ఆధార సహిత వాస్తవాలు వెలుగులోకి వచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో దళితులు ఆదివారం నాడు పెద్ద సంఖ్యలో బీమాకోరేగావ్ చేరుకొని అమరవీరులకు నివాళులర్పించారు.

ధర్మాన విచ్ఛిన్నకర వ్యాఖ్యలు తగవు : సిపిఎం

● లోపలి పేజీలో.. ●

పింఛన్ల డబ్బుల్లో దొంగనోట్లు

- గ్రామ వలంటీర్ నిర్వాకం

● లోపలి పేజీలో.. ●

ఇ-కామర్స్ కంపెనీల్లో అంతులేని శ్రమదోపిడి

- 'ఫెయిర్‌వర్క్ ఇండియా' తాజా నివేదికలో వెల్లడి

మూడు నెలల్లో విశాఖ రాజధాని!

- రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

మూడు నెలల్లో విశాఖపట్నం కార్యనిర్వాహక రాజధాని కాబోతోందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. విజయనగరంలోని తన నివాసంలో అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఆదివారం ఆయన నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. జిల్లావాసులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మీడియాతో బొత్స మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సమగ్రాభివృద్ధిని కోరుకుంటున్నారని, అందులో భాగంగా మరో మూడు నెలల్లో విశాఖపట్నం పరిపాలనా రాజధాని కాబోతోందని చెప్పారు. ఇది తమ ప్రభుత్వం విధానం కూడా అంటూ స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన పనులు త్వరగా నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సిఎం కూడా విశాఖ షిఫ్ట్ అవ్వాలని కోరుకుంటున్నామని, ఆ కోరిక త్వరలోనే తీరుతుందని చెప్పారు. ఫిబ్రవరిలోపు భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేస్తామన్నారు. ఇప్పటికే అందుకు సంబంధించిన పనులు పూర్తయ్యాయని తెలిపారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసేందుకు వైసిపి జిల్లా నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తరలివచ్చారు. జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు తదితరులు మంత్రికి శుభాకాంక్షలు అందజేశారు. వేడుకల్లో బొత్స సతీమణి, మాజీ ఎంపి ఝాన్సీలక్ష్మి, కుమారుడు సందీప్ పాల్గొన్నారు.

నేటి నుంచి సమ్మెటివ్-1 పరీక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్యార్థులకు సోమవారం నుంచి సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు జరుగుతాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు గణితం, జనరల్ సైన్స్ పరీక్షలకు రాష్ట్రప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల్లో ఉన్న ప్రశ్నాపత్రాల ద్వారా పాఠశాల విద్యాశాఖ పరీక్షలు నిర్వహించనుంది. మిగిలిన అన్ని సబ్జెక్టులు, అన్ని తరగతులకు డిసిఇబి ద్వారా ముద్రించిన కామన్ ప్రశ్నాపత్రాల ద్వారా పరీక్షలు జరపనుంది. ఈ పరీక్షల అనంతరం విద్యార్థులకు సంక్రాంతి సెలవులు ప్రారంభం కానున్నాయి. జనవరి 11 నుంచి 16వ తేదీ వరకు పాఠశాలలకు సంక్రాంతి సెలవులుగా ఎస్‌సిఇఆర్‌టి అకడమిక్ క్యాలెండర్‌లో పేర్కొంది. ఈ ప్రకారమే పాఠశాలలకు సెలవులు ఉంటాయి. 17వ తేదీన తిరిగి ప్రారంభం కానున్నాయి.

హర్యానా క్రీడల మంత్రిపై లైంగిక వేధింపుల ఆరోపణలు

- కేసు నమోదుతో రాజీనామా

సందీప్ సింగ్

న్యూఢిల్లీ : హర్యాణా రాష్ట్ర క్రీడల మంత్రి, బిజెపి నేత సందీప్ సింగ్.. ఒక జూనియర్ మహిళా అథ్లెట్ కోచ్‌పై లైంగిక వేధింపులకు పాల్పడినట్లుగా ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు ఆయనపై కేసు కూడా నమోదైంది. తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రత్యర్థులు చేస్తున్న కుట్రగా ఈ ఆరోపణలను కొట్టిపారేసిన సందీప్..దీనిపై సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరముందని తెలిపారు. అందుకే తాను మంత్రిత్వశాఖ బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్లు తెలిపారు. తనకు అనుకూలంగా వ్యవహరిస్తే అన్ని సౌకర్యాలు కల్పిస్తానంటూ సందీప్ సింగ్ లైంగిక వేధింపులకు గురి చేశారని హర్యానాకు చెందిన జూనియర్ మహిళా అథ్లెట్ కోచ్ ఒకరు ఇటీవల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. తనను సంతోషంగా ఉంచితే కోరుకున్న చోట పోస్టింగ్ ఇప్పిస్తానంటూ లొంగదీసుకునేందుకు సందీప్ ప్రయత్నించారనీ, తాను అందుకు నిరాకరించడంతో తనని వేరే చోటుకి బదిలీ చేశారని ఆమె ఆరోపించారు. దీనిపై రాష్ట్ర డిజిపి, ముఖ్యమంత్రి, రాష్ట్ర హోంమంత్రి శాఖ కార్యాలయాలకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని సదరు అథ్లెట్ కోచ్ వాపోయారు. చాలా మంది క్రీడాకారులను మంత్రి సందీప్ ఇలాగే వేధించారని, అయితే భయంతో ఎవ్వరూ ముందుకొచ్చి చెప్పుకోలేకపోయారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై మహిళా సంఘాలు, ప్రతిపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో సందీప్‌పై కేసు నమోదయ్యింది. ఈ నేపథ్యంలో మంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు సందీప్ ప్రకటించారు. కురుక్షేత్రలోని పెహోవా అసెంబ్లీ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సందీప్ సింగ్ కూడా హాకీ క్రీడాకారుడే. జాతీయ జట్టుకు కెప్టెన్‌గానూ వ్యవహరించారు. 2018లో సూర్మా పేరుతో ఆయనపై బయోపిక్ కూడా వచ్చిన సంగతి విదితమే.

ఆఫ్ఘన్ వైమానిక స్థావరంలో పేలుడు

- 10 మంది మృతి
- పలువురికి గాయాలు

కాబూల్ : తాలిబాన్ పాలనలో ఉన్న ఆఫ్గనిస్తాన్‌లోని కాబూల్‌లో ఆదివారం నాడు భారీ పేలుడు చోటుచేసుకుంది. కాబూల్‌లోని వైమానిక స్థావరంలో సంభవించిన ఈ పేలుడులో 10 మంది చనిపోయారు. 8 మంది గాయపడ్డారని తాలిబాన్ హోంమంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి అబ్దుల్ నఫీ టక్కూర్ తెలిపారు. వైమానిక స్థావరం ప్రధాన ద్వారం వద్ద ఈ పేలుడు సంభవించినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే చనిపోయినవారి సంఖ్య, క్షతగాత్రుల సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుందని వివిధ వార్తా సంస్థలు పేర్కొన్నాయి. ఈ పేలుడుకు తామే బాధ్యులమని ఇప్పటి వరకు ఏ సంస్థ కూడా ప్రకటించలేదు. టఖర్ ప్రావిన్సులో గత బుధవారం సంభవించిన పేలుడు నలుగురు గాయపడ్డారు. ఆ ఘటన మరవక ముందే అందునా వైమానిక స్థావరం వద్ద పేలుడు చోటుచేసుకోవడం గమనార్హం.

విశాల ఐక్యత... సమరశీల పోరాటాలు

● అదే సిఐటియు రాష్ట్ర మహాసభ లక్ష్యం ● నేటి నుండి భీమవరంలో ప్రారంభం ● ప్రజాశక్తితో ఎంఎ గఫూర్

కుల,మత, రాజకీయాలకు అతీతంగా కార్మికుల మధ్య విశాల ఐక్యతను నిర్మించి, సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలకు వారిని సన్నద్ధం చేయడమే భీమవరంలో జరుగుతున్న సిఐటియు 16వ మహాసభ లక్ష్యమని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ గఫూర్ అన్నారు. నేటి నుండి ప్రారంభం కానున్న మహాసభకు భీమవరంలో విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివస్తున్న ప్రతినిధులు మూడు రోజుల పాటు ఇక్కడ కార్మిక సమస్యలపై మేథోమథనం చేసి, భవిష్యత్ కార్యాచరణకు రూపు ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో ప్రజాశక్తికి గఫూర్ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇంటర్వ్యూ వివరాలు క్లుప్తంగా :

ప్రజాశక్తి - భీమవరం

ప్ర: మహాసభ ప్రాధాన్యత ఏమిటి?

జ: గత మహాసభ 2019లో నెల్లూరులో జరిగింది. ఆ తరువాత కరోనా మహమ్మారి విరుచుకుపడింది. ఆ కష్టకాలంలోనూ రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఎన్నో కార్మిక పోరాటాలు జరిగాయి. రైతాంగం చేపట్టిన పోరాటానికి కార్మికులు మద్దతు తెలిపారు. కార్మిక పోరాటాలకు రైతులు అండగా నిలుస్తున్నారు. మన రాష్ట్రంలోనూ ఆ స్ఫూర్తి కనిపించింది. దీనితో పాటు వివిధ తరగతుల కార్మికులు చేసిన ఉద్యమాలను సమీక్షించుకుంటాం. ఆ అనుభవాల పాఠాలతో రాబోయే కాలంలో సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలకు సన్నద్ధమయ్యేలా భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకోవడం మహాసభ లక్ష్యం

ప్ర: కరోనా కష్ట కాలంలో కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరి ఎలా ఉంది?

జ: కార్మికులను ఆదుకోవడానికి బదులుగా కార్పొరేట్లను మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పనిచేసింది. కార్మికుల హక్కులను కుదిస్తూ నాలుగు నల్ల చట్టాలను లేబర్ కోడ్ల పేరుతో ఆమోదించడం దీనిలో భాగమే. కార్మిక సంఘాలతో మాట మాత్రంగా చర్చించకుండా బ్రిటీష్ ప్రభుత్వంతో పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కూడా కుదించే ప్రయత్నం చేసింది. దీనికి నిరసనగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జరిగిన మూడు జాతీయ సమ్మెలు రాష్ట్రంలో జయప్రదం అయ్యాయి. ఈ కృషిలో సిఐటియు కీలకపాత్ర వహించింది. సమ్మెల జయప్రదానికి విస్తృత ప్రచారాన్ని నిర్వహించడమే కాక సమ్మె రోజున రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్మికవర్గాన్ని సమీకరించి భారీ ప్రదర్శనలు నిర్వహించింది. అలాగే అంగన్‌వాడీ, ఆశా, ఇతర రంగాలవారి పిలుపులను విజయవంతం చేసింది. అనేక సందర్భాల్లో శ్రామిక మహిళల భారీ ప్రదర్శనలు, ధర్నాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాం. అదే సమయంలో కేంద్ర బిజెపి

మిగతా 2లో

సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ప్రజానాట్య మండలి ఆధ్వర్యాన ఆట, పాట, మాట

-వార్త లోపలి పేజీల్లో

తమిళనాడులో ప్రభుత్వ ఉద్యోగులకు 4 శాతం డిఎ పెంపు

చెన్నయ్ : తమిళనాడులో ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి స్టాలిన్ నూతన సంవత్సర కానుక అందించారు. కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టిన వేళ ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యాన్ని (డిఎ) 4 శాతం పెంచుతున్నట్లు ఆదివారం నాడు ఆయన ప్రకటించారు. ఉపాధ్యాయులతో పాటు పెన్షనర్లకు కూడా డిఎ పెంపు వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న 34 శాతంగా ఉన్న డిఎ తాజా పెంపుతో 38 శాతానికి చేరుతుందని సిఎం తెలిపారు. ఈ నిర్ణయం జనవరి 1 నుంచే అమల్లోకి వచ్చినట్లు ఆయన చెప్పారు. తాజా నిర్ణయంతో రాష్ట్రంలోని దాదాపు 16 లక్షల మందికి లబ్ధి చేకూర నుంది. డిఎ పెంపుతో ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వంపై రూ.2359 కోట్లు అదనంగా వెచ్చించాల్సివుందనీ, అయినా ఉద్యోగుల సంక్షేమాన్ని దష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్టాలిన్ వెల్లడించారు. నూతన సంవత్సర కానుకగా డిఎను అభివర్ణించిన స్టాలిన్.. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కషిచేస్తున్న తమ ప్రభుత్వానికి ఉద్యోగులంతా సహకరించాలని కోరారు. మరోవైపు, 'సమాన పనికి సమాన వేతనం' కోరుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు కొంతకాలంగా చేస్తున్న ఆందోళనల అంశంపైనా ఆయన స్పందించారు. దీనిపై ఆర్థిక శాఖ కార్యదర్శి నేతృత్వంలో ఉన్నతాధికారులతో త్రిసభ్య కమిటీ వేశా మని, కమిటీ ప్రతిపాదనల మేరకు టీచర్లకు సానుకూలమైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బిఆర్‌ఎస్‌లోకి తోట, రావెల

- నేడు కెసిఆర్ సమక్షంలో చేరిక

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

బిఆర్‌ఎస్ పార్టీలోకి వెళ్లేందుకు రాష్ట్రానికి చెందిన పలువురు నాయకులు సన్నద్ధమయ్యారు. విశ్రాంత ఐఎఎస్ అధికారి తోట చంద్రశేఖర్ నాయకత్వంలో మాజీ మంత్రి, విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి రావెల కిషోర్‌బాబు, ఐఆర్‌ఎస్ అధికారి పార్థసారథి సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు హైదరాబాద్‌లో బిఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ సమక్షంలో ఆ పార్టీలో చేరనున్నారు.

తోట చంద్రశేఖర్ 2009లో గుంటూరు లోక్‌సభకు ప్రజారాజ్యం తరుపున, 2014లో ఏలూరు నుంచి వైసిపి తరుపున, 2019లో జనసేన తరుపున గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తరువాత జనసేనలో రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులుగా కొనసాగారు. కొంత కాలంగా ఆ పార్టీకి దూరంగా ఉంటున్న చంద్రశేఖర్ తాజాగా బిఆర్‌ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు. రావెల కిషోర్‌బాబు 2014లో ప్రత్తిపాడు నుంచి టిడిపి తరుపున ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవిగా పని చేశారు. 2019 ఎన్నికల్లో జనసేన తరుపున ప్రత్తిపాడు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత బిజెపిలో చేరారు. పార్థసారథి ఇప్పటి వరకు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఆయన కూడా ఐఆర్‌ఎస్ అధికారిగా పనిచేసి రిటైర్డు అయ్యారు. వీరితోపాటు మరికొంత మంది కూడా బిఆర్‌ఎస్‌లో చేరనున్నట్టు తెలిసింది. తోట చంద్రశేఖర్‌కు పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

'రక్తదాన శిబిరం' పోస్టర్ ఆవిష్కరించిన చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్‌టి రామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా టిడిపి న్యాయవిభాగం (లీగల్ సెల్) ఆధ్వర్యాన నిర్వహించనున్న రక్తదాన శిబిరం పోస్టర్‌ను టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. హైకోర్టు దగ్గర నేలపాడు వద్ద ఎన్టీఆర్ ట్రస్ట్ సహకారంతో ఈ నెల 23న ఈ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో టిడిపి లీగల్ సెల్ అధ్యక్షులు పోసాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా చంద్రబాబును ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు టిడిపి కార్యాలయంలో కలిసి, శుభాకాంక్షలు తెలిపారు.

భక్తులతో మాట్లాడుతున్న టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి

వైకుంఠ ఏకాదశి సర్వదర్శన టోకెన్లజారీ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారి వైకుంఠ ఏకాదశి టోకెన్ల కౌంటర్లలో భక్తుల రద్దీ కారణంగా ఆదివారం వేకువ జామునుండే సర్వదర్శన టోకెన్లను టిటిడి మంజూరు చేసింది. ఆదివారం మధ్యాహ్నం నుండి ఇవ్వాలని మొదట ప్రకటించినా ముందు రోజు నుండే క్యూలైన్లలో భక్తులు వేచి ఉండడం, స్వల్పంగా తొక్కిసలాటలు జరగడంతో మంజూరు ప్రక్రియను టిటిడి ముందుగా ప్రారంభించింది. దీంతో ఉదయం 9 గంటలలోపు భక్తులు దాదాపు లక్షన్నర టికెట్లను పొందారు. టిటిడి మరో మూడున్నర లక్షల టికెట్లను నిరంతరాయంగా మంజూరు చేసి కౌంటర్లను మూసివేయనుంది.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరుకు సిద్ధం కావాలి

- కార్మిక చైతన్య యాత్రల్లో సిఐటియు నేతలు
- పశ్చిమగోదావరి జిల్లాకు చేరుకున్న బృందాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరగనున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ సత్యసాయి, చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాల నుంచి డిసెంబర్ 28న ప్రారంభమైన రాష్ట్ర కార్మిక చైతన్య యాత్రలు ఆదివారం రాత్రి తాడేపల్లిగూడెం పట్టణానికి చేరుకున్నాయి. చైతన్య యాత్రలకు సిఐటియు నేతలు ఘనస్వాగతం పలికారు. ఈ యాత్రలకు కార్మికులు, ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. బైకులు, ఆటోలు, కార్లతో ర్యాలీలు నిర్వహించారు.

శ్రీకాకుళం జాతానుద్దేశించి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, జాతీయ ఉపాధ్యక్షులు బేబీరాణి, సత్యసాయి జిల్లా జాతానుద్దేశించి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి.నరసింహారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.స్వరూపరాణి, చిత్తూరు జిల్లా జాతానుద్దేశించి సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు కె.సుబ్బరావమ్మ, ఆర్‌వి.నరసింహారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.అజయ్‌కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు జి.ఓబులు, డి.రమాదేవి మాట్లాడారు. కార్మికుల కడుపుమాడ్చి పాలకులు యాజమాన్యాలకు కొమ్ముగాస్తున్నారని విమర్శించారు. కార్మిక చట్టాలను మార్చి కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయన్నారు. వీటికి వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. భీమవరంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జాతాలకు స్వాగతం పలికిన వారిలో నేతలు కర్రి నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణ ఎన్.రమణరావు, జి.నాగేశ్వరరావు, చిటికిన రాము, జవ్వాది శ్రీను, పి.పైడియ్య ఉన్నారు.

తాడేపల్లిగూడెం చేరిన జాతానుద్దేశించి మాట్లాడుతున్న బేబీరాణి

అంతకుముందు శ్రీకాకుళం జిల్లా మందసలో ప్రారంభమైన కార్మిక చైతన్య యాత్ర తూర్పుగోదావరి జిల్లాలోకి ప్రవేశించింది. ధవళేశ్వరం, రాజమహేంద్రవరం, కొవ్వూరు, ఉండ్రాజవరం మండలాల్లో చైతన్య యాత్ర కొనసాగింది. తొలుత ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద కాటన్ విగ్రహానికి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నర్సింగరావు, జాతీయ ఉపాధ్యక్షులు బేబిరాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా సెంటర్లలో కార్మికులను ఉద్దేశించి వారు మాట్లాడారు. సత్యసాయి జిల్లా హిందూపురం నుంచి ప్రారంభమైన చైతన్య యాత్ర గుంటూరు జిల్లా మంగళగిరి మీదుగా తాడేపల్లిలోని ఉండవల్లి సెంటర్‌కు చేరుకుంది. అక్కడ జరిగిన సభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి.నరసింహారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.స్వరూపరాణి మాట్లాడారు. అక్కడ నుంచి ర్యాలీగా ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోకి ప్రవేశించింది. చిత్తూరు జిల్లా కుప్పం నుంచి బయలుదేరిన చైతన్య యాత్రకు కృష్ణా జిల్లా మీదుగా ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడకు చేరింది. రెండు చైతన్య యాత్రలు బెంజిసర్కిల్ సెంటర్‌లోని బిల్డింగ్ వర్కర్స్ అడ్డా, గవర్నర్‌పేటలోని హమాలీ వర్కర్స్ అడ్డా, కేదారేశ్వరపేటలోని మ్యాంగో మార్కెట్, వన్‌టౌన్‌లోని నెహ్రూ బొమ్మ సెంటర్ వరకూ కొనసాగింది. అక్కడి నుంచి విజయవాడ రూరల్, గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల మీదుగా ఏలూరు జిల్లాలోకి ప్రవేశించాయి. గన్నవరం విమానాశ్రయం ప్రధాన ద్వారం వద్ద జాతాలకు సిఐటియు నేతలు జెండాలతో స్వాగతం పలికారు. ఆయా సెంటర్లలో కార్మికులనుద్దేశించి సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు కె.సుబ్బరావమ్మ, ఆర్‌వి.నరసింహారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.అజయ్‌కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు జి.ఓబులు, డి.రమాదేవి మాట్లాడారు.

మార్చిలో పెరగనున్న విద్యుత్ డిమాండ్

- రోజువారీ 250 ఎంయుకు చేరే అవకాశం
- ఇంధన శాఖమంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ వినియోగం ఈ ఏడాది మార్చిలో పెరిగే అవకాశం ఉందని ఇంధన శాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మార్చిలో సగటు డిమాండ్ రోజుకు 250 మిలియన్ యూనిట్ల(ఎంయు)కు పెరుగుతుందని అంచనా వేశామని తెలిపారు. ఇది 2022 మార్చి నుంచి దాదాపు 13.6శాతం పెరుగుదలగా ఉందని చెప్పారు. విద్యుత్ సంస్థల అధికారులతో ఆదివారం మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో 2021-22లో 60,945 ఎంయుగా ఉన్న వార్షిక ఇంధన వినియోగం, 2022-23 నాటికి 64,523 ఎంయుకు పెరిగిందని అంచనా వేశామన్నారు. ఇది 5.8శాతం పెరుగుదలగా నమోదైందని తెలిపారు. రాష్ట్రంలోని చివరి వినియోగదారుడి వరకూ తక్కువ ఖర్చుతో కూడిన విద్యుత్‌ను అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించుకుందని చెప్పారు. విండ్, సోలార్, హైబ్రిడ్ ప్రాజెక్టులను స్థాపించేందుకు పునరుత్పాదక ఇంధన ఎగుమతి విధానం-2020ను ప్రకటించిందన్నారు. రాష్ట్రంలో 33 గిగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ హైడ్రో స్టోరేజీ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తామన్నారు. ఇవి పూర్తయితే విద్యుత్ రంగంలో ఎపి నెంబర్‌వన్‌గా నిలుస్తుందని, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయగలదని వెల్లడించారు. ప్రభుత్వం ఇటీవల 6,500 మెగావాట్ల సోలార్, 2050 మెగావాట్ల పవన్, 10,980 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో పవర్ ప్రాజెక్టులను ప్రైవేట్ డెవలపర్లకు కేటాయించిందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో సిఎమ్‌డి బి శ్రీధర్, జెఎండి ఐ.పృథ్వీతేజ్, డిస్కంల సిఎండిలు జె పద్మ జనార్ధనరెడ్డి, కె సంతోషరావు పాల్గొన్నారు.

ఒక్క రోజులో రూ.200 కోట్ల మద్యం తాగేశారు

- అత్యధికంగా విశాఖలో రూ.30 కోట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నూతన సంవత్సర వేడుకల్లో రాష్ట్రంలో మద్యం ఏరులై పారింది. రాష్ట్రవ్యాప్తంగా సాధారణ రోజుల్లో సగటున రోజుకు వందకోట్ల లోపు జరిగే మద్యం అమ్మకాలు డిసెంబర్ 31న ఒక్కరోజే రికార్డుస్థాయిలో రూ.191.22 కోట్లకు పెరిగాయి. కొత్త సంవత్సరం పేరుతో అదనపు సమయంలో కూడా షాపులు తెరిచివుంచడంతో మద్యం వినియోగం గణనీయంగా పెరిగింది. కొత్త సంవత్సరం నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 88,669 కేసుల బీరు, 2,02,915 కేసుల మద్యం బాక్సులు అమ్ముడుపోయాయి. అత్యధికంగా విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలో రూ.30.05 కోట్ల అమ్మకాలు జరిగాయి. 28,575 మద్యం కేసులు, 17,280 బీర్ల కేసులు అమ్ముడయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల్లో జరిగిన అమ్మకాల్లో గుంటూరు జిల్లాలో రూ.26.1కోట్లు, కృష్ణా జిల్లాలో రూ.19.53 కోట్లు, తూర్పుగోదావరిలో రూ.17.33 కోట్లు, పశ్చిమ గోదావరిలో రూ.14.80 కోట్లు, ప్రకాశం జిల్లాలో రూ.13.56 కోట్లు, చిత్తూరు జిల్లాలో రూ.12.46 కోట్లు, కర్నూలులో రూ.11.76 కోట్లు, నెల్లూరులో రూ.11.12 కోట్లు, కడపలో రూ.9.96 కోట్లు, అనంతపురంలో రూ.9.25 కోట్లు, విజయనగరంలో రూ.8.99 కోట్లు, శ్రీకాకుళం జిల్లాలో రూ.6.13 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి.

రాజ్‌భవన్, సిఎం నివాసాల్లో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజ్‌భవన్, సిఎం నివాసాల్లో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, సుప్రవ హరిచందన్ దంపతులను కలిసి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడి తదితరులు ఉన్నారు.

టిటిడి, విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం పండితులు గవర్నర్ దంపతులను ఆశీర్వదించి శ్రీవారి ప్రసాదం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. గవర్నర్‌ను కలిసిన వారిలో సిఎం కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మన్ తలశిల రఘురాం, ఎంపి నందిగం సురేష్, బిసి సంక్షేమశాఖ సంచాలకులు అర్జునరావు, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, మైనారిటీ సంక్షేమశాఖ డైరెక్టర్ కిషోర్, జిల్లా జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్‌కుమార్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్, సమాచార హక్కు చట్టం ముఖ్య కమిషనర్ ఆర్‌ఎం బాషా, కమిషనర్లు బివి రమణకుమార్, కాకర్ల చెన్నారెడ్డి, పి.శ్యామ్యూల్ జొన్నాథన్, ప్రొటోకాల్ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యరెడ్డి, ఎపి రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి ఫరీడా, రాజ్‌భవన్ సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాష్, ఉప కార్యదర్శి నారాయణస్వామి, దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి భ్రమరాంబ పాల్గొన్నారు.

సిఎం నివాసంలో...

తాడేపల్లిలోని సిఎం నివాసంలో నూతన సంవత్సరం వేడుకలు జరిగాయి. ఆదివారం ఉదయం తన నివాసంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేక్ కట్ చేసి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాసన మండలి ఛైర్మన్ కె మోషెన్‌రాజు, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర మంత్రులు జోగి రమేష్, విడదల రజిని, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి, డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపి నందిగం సురేష్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ తదితరులు తాడేపల్లికి చేరుకుని సిఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ధర్మాన విచ్ఛిన్నకర వ్యాఖ్యలు తగవు : సిపిఎం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాల్సిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మరో రాష్ట్రం ఏర్పాటు చేయాలంటూ విచ్ఛిన్నకర వ్యాఖ్యలు చేయడం సరికాదని సిపిఎం శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కావాలంటే వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి స్పష్టం చేశారు. అన్ని ప్రాంతాలు, జిల్లాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. విభజన వల్ల రాష్ట్రం నష్టపోయిందని గుర్తు చేశారు. ఉన్న రాష్ట్రాన్ని మళ్లీ విభజించాలని వాదనలు చేయడం మరింత నష్టానికి గురిచేస్తుందని తెలిపారు. మంత్రి ధర్మాన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని వారు కోరారు.

పింఛన్ల డబ్బుల్లో దొంగనోట్లు

- గ్రామ వలంటీర్ నిర్వాకం

ప్రజాశక్తి- యర్రగొండపాలెం (ప్రకాశం జిల్లా)

వలంటీర్ ఇచ్చిన దొంగనోట్లను చూపుతున్న లబ్ధిదారులు

గ్రామ వలంటీరు పింఛను డబ్బుల్లో దొంగనోట్లు కలిపి పంపిణీ చేశాడు. బాధితుల ఫిర్యాదుతో అధికారులు స్పందించారు. వలంటీర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలంలో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి బాధితులు, పోలీసుల కథనం ప్రకారం... నరసాయిపాలెం ఎస్‌సి కాలనీ గ్రామ వలంటీరుగా ముటుకూరి ఆమోష్ పని చేస్తున్నాడు. ఒకటో తేదీ కావడంతో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసేందుకు అధికారుల నుంచి డబ్బులు తీసుకున్నాడు. ఈ డబ్బులలో రూ.19,500 పక్కకు తీసి తన దగ్గర ఉన్న రూ.19.500 దొంగనోట్లను (రూ.500 నోట్లను) అందులో కలిపాడు. 24 మంది లబ్ధిదారులకు రూ.2,750 చొప్పున పింఛను పంపిణీ చేశాడు. ఇందులో కొంతమందికి నకిలీ నోట్లు వెయ్యి రూపాయల చొప్పున కలిపి ఇచ్చాడు. పింఛను డబ్బులు తీసుకున్న బంగారమ్మ అనే మహిళ తన బంధువులకు ఫోన్ పే చేయించేందుకు వెళ్లింది. ఇందుకోసం దుకాణందారునికి డబ్బులు ఇచ్చింది. ఇందులో దొంగనోట్లు ఉన్నట్లు ఆయన గుర్తించి ఆమెకు తెలియజేశాడు. ఈ విషయం తెలుసుకున్న మిగతా లబ్ధిదారులు కూడా తాము తీసుకున్న పింఛను డబ్బులను దుకాణందారు దగ్గరకు తీసుకెళ్లి చూపించగా, వాటిలోనూ దొంగనోట్లు బయటపడ్డాయి. ఈ విషయాన్ని నరసాయిపాలెం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పేరయ్య, ఎంపిడిఓ ఎం.రంగసుబ్బరాయుడు దృష్టికి లబ్ధిదారులు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో పోలీసులతో కలిసి నరసాయిపాలేనికి ఎంపిడిఓ వచ్చి నిలదీయడంతో తానే దొంగనోట్లను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు వలంటీర్ ఒప్పుకున్నాడు. ఎంపిడిఓ ఫిర్యాదు మేరకు వలంటీరును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ దొంగనోట్లు వలంటీర్‌కు ఎలా వచ్చాయి? ఇటువంటి చర్యకు పాల్పడడం ఇదే తొలిసారా? ఇందుకు ముందుకూడా ఇలా చేశాడా? ఈ దొంగనోట్ల వెనుక ఎవరు ఉన్నారు? తదితర విషయాలపై విచారణ చేస్తున్నట్లు సమాచారం.

దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు

మరింత ఉత్తేజంతో 'ఉక్కు' పోరాటం

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటాన్ని ఆపేది లేదని, నూతన సంవత్సరంలో మరింత ఉత్తేజంతో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 689వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ సిఐటియు కార్యకర్తలు, కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ ఛైర్మన్ డి ఆదినారాయణ, నాయకులు పి శ్రీనివాసరాజు, నమ్మి రమణ, జి శ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెట్టడం దారుణమన్నారు. పబ్లిక్ సెక్టార్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమైందన్న విషయాన్ని మోడీ సర్కారు గుర్తెరగాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, పూర్తి స్థాయి సామర్థ్యంతో కర్మాగారం నడిచేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరంలోనే కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నందికి తాతారావు, పిట్టా రెడ్డి, పి.నారాయణ, సన్యాసిరావు, పి మహేష్, యు సోమేష్, చట్టి నరసింగరావు, శ్యాంసుందర్, సిహెచ్ రాము, సింహాచలం, సోమినాయుడు, ఎస్ పైడిరాజు, వి సోమేష్ పాల్గొన్నారు.

బంజరాహిల్స్‌లో కారు బీభత్సం..

- ఇద్దరు ఎపి వాసుల మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 3లో ఆదివారం ఓ కారు బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు ఎపి వాసులు మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లవారుజామున 5:38 నిమిషాలకు జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి పంజాగుట్ట వైపు వెళ్తున్న ఓ కారు బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 3లో రాయల్ టిఫిన్ సెంటర్ వద్ద డివైడర్‌ను ఢీకొని అదుపు తప్పింది. ఈ క్రమంలో మరో రెండు కార్లను ఢీకొట్టింది. అదే సమయంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ, మరో వ్యక్తిని బలంగా ఢీకొట్టడంతో వారు గాల్లోకి ఎగిరి కిందపడి అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన ప్రణవ్, వర్ధన్‌ను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన వారిని ఎపిలోని రావులపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాస్, భీమవరానికి చెందిన ఈశ్వరిగా గుర్తించారు. ఈశ్వరీ ఇళ్లల్లో పనిచేసుకొని జీవనం సాగిస్తుంది. శ్రీనివాస్ పెయింటర్‌గా పనిచేస్తున్నారు. నిందితులు మద్యం తాగి వాహనం నడపడంతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు.

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోకుండా ఏకపక్షంగా విధించిన లాక్‌డౌన్ వల్ల దేశవ్యాప్త కార్మికులు, కష్ట జీవులు అనుభవించిన బాధలు వర్ణనాతీతం. విధిలేని పరిస్థితిలో వలస కార్మికులు తమ స్వస్థలాలకు కాలినడకతో వేల కిలోమీటర్లు నడుస్తూ పోవడం స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే ఒక విషాద ఘట్టం. కరోనా బాధిత ప్రజలను ఆదుకోవడంలో రాష్ట్ర కార్మికవర్గం ఎంతో ఆదర్శాన్ని చూపింది. సుమారు రూ. 3 కోట్లు సేకరించి కరోనా బాధితులకు, వలస కార్మికులకు సేవా, సంఘీభావ కార్యక్రమాలకు వెచ్చించడం జరిగింది. దారి పొడుగునా వంటశాలలు ఏర్పాటు చేసి కాలినడకన వెళ్తున్న వలస కార్మికులకు తోడ్పడటం జరిగింది.

విశాల ఐక్యత... సమరశీల పోరాటాలు

ప్ర: రాష్ట్ర ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తోంది?

జ: రాష్ట్రంలో 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరిస్తామని, మంచి పిఆర్‌సి అమలు చేస్తామని, సమాన పనికి - సమాన వేతనం ద్వారా ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఆదుకుంటామని, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి హామీలు ఇచ్చారు. అందువల్ల ఆయనపై కారికులు పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకున్నారు. అయితే ఈ ఆశలన్నింటినీ అడియాశలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన సాగుతున్నది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యేలు, ఇతర అధికార పార్టీ నాయకులు, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్నభోజనం తదితర చిరుద్యోగులు, విద్యుత్ శాఖలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై కక్ష కట్టి రాజకీయ కారణాలతో ఉన్న వారిని తొలగించారు. తమ పార్టీ అనుయాయులను లేదా భారీ మొత్తంలో డబ్బు చెల్లించే వారికి ఉద్యోగాలిచ్చే దుర్మార్గమైన సంస్కృతిని ప్రారంభించారు. అన్యాయంగా తొలగించబడ్డ ఒకరిద్దరు కార్మికులు ఆత్మహత్యలు చేసుకోగా మరి కొందరు ఆత్మహత్యా ప్రయత్నం చేశారు. ఉద్యోగాలు ఉంటాయో, పోతాయో అనే అభద్రత కార్మికులను వేధించింది. ఈ పరిస్థితుల్లో తొలగింపులకు వ్యతిరేకంగా సిఐటియు సంఘాలు తీసుకున్న ఉద్యమాలు, చేసిన పోరాటాలు కార్మికుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. ఎక్కడికక్కడ కార్మికులు తొలగింపులకు వ్యతిరేకంగా తండోప తండాలుగా కదలి ఆందోళనల ద్వారా ప్రతిఘటన చేయడంతో ప్రభుత్వం దిగివచ్చి ఎవర్నీ తొలగించవద్దని ఆదేశాలివ్వాల్సి వచ్చింది. దీంతో రాష్ట్రంలో సిఐటియు ప్రతిష్ట మరింత పెరిగింది.

ప్ర: కార్మిక హక్కులు అమలవుతున్నాయా?

జ: రాష్ట్రంలో ఉద్యోగ కార్మికుల పట్ల ప్రభుత్వం ప్రతికూల వైఖరితో వ్యవహరిస్తోంది. కార్మికశాఖను దాదాపు నిర్వీర్యం చేశారు. ప్రభుత్వం ప్రత్యేకించి పోలీసు యంత్రాంగం మద్దతుగా ఉండటంతో పారిశ్రామిక యాజమాన్యాలు అడ్డగోలుగా వ్యవహరిస్తూ కార్మిక సంఘాలపై, కార్మికుల హక్కులపై దాడి చేయడం బాగా పెరిగింది. రాష్ట్రంలో శాంతియుత ప్రదర్శనలకు, ధర్నాలకు చివరికి నిరాహార దీక్షలకు కూడా ప్రభుత్వం అనుమతివ్వడం లేదు. ఏకపక్షంగా కేసులను నమోదు చేసి అరెస్టు చేయడం నిత్యకృత్యంగా మారింది. ఆందోళనలకు అనుమతినివ్వరు. ఇచ్చిన సందర్భాల్లో కూడా జనాన్ని ఒక చోట చేరనీయకుండా చెదరగొట్టడం పోలీసులకు అలవాటుగా మారింది. పోలీసు నిర్బంధానికి వ్యతిరేకంగా అన్ని కార్మిక సంఘాలను కలుపుకుని కొంత కృషి జరిగినా రాబోయే కాలంలో కార్మికుల ప్రజాతంత్ర హక్కులను కాపాడుకోవడం కోసం పెద్ద ఎత్తున ఉద్యమించక తప్పని పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్నది. రాష్ట్రంలో 50 లక్షలకు మందికి పైగా ఉన్న షెడ్యూల్డ్ పరిశ్రమల కార్మికులకు గత 15-20 సంవత్సరాలుగా వేతన సవరణ లేదు. దాని వల్ల ఈ రోజుకు కూడా ఆనాటి వేతనాలతోనే పని చేయాల్సిన దుస్థితిలో ఉన్నారు. ధరల పెరుగుదలను బట్టి పక్క రాష్ట్రాల కార్మికులతో పోల్చి వేతనాలను సవరించడం ప్రభుత్వం బాధ్యత. వ్యాపారనుకూల విధానాల మోజులో గత ప్రభుత్వాల లాగానే వైసీపీ ప్రభుత్వం కూడా షెడ్యూల్డ్ పరిశ్రమల కార్మికులకు తీరని అన్యాయం చేస్తోంది.

ప్ర: ప్రభుత్వ, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి ఎలా ఉంది?

జ: ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్‌సి తుది రూపం ఇవ్వకముందు మధ్యంతర భృతిగా ఇచ్చిన నిధులను కూడా పిఆర్‌సిలో కుదించి, వేతనాల నుంచి మినహాయించుకోవడం చరిత్రలో ఎన్నడూ జరగలేదు. విఆర్‌ఏ లాంటి చిరుద్యోగులకు గత ప్రభుత్వంలో ఇచ్చిన డిఏ ను కూడా తిరిగి వసూలు చేయడానికి ప్రభుత్వం పూనుకున్నది. సిపిఎస్ రద్దు తమకు అవగాహన లేకుండా ఇచ్చిన వాగ్దానమని చెబుతూ పాత పెన్షన్‌ను నిరాకరిస్తున్నది. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయడం ప్రభుత్వం మరచిపోయింది. ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కుదిస్తూ వేలాది మందిని ఉద్యోగాల నుండి తొలగించేందుకుప్రయత్నాలుచేస్తున్నది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ సమస్యలపై ఉద్యమిస్తూ ఉన్నారు. వారి పైన పోలీసు నిర్బంధం తీవ్రంగా పెరుగుతున్నది.

ప్ర: అసంఘటిత రంగ కార్మికుల పరిస్థితి ఏమిటి?

జ: భవన నిర్మాణ కార్మికులకు చట్ట ప్రకారంగా వారి సంక్షేమానికి సేకరించిన రూ. 1250 కోట్లు నిధిని రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానాకు జమ చేసుకుంది. ప్రమాదాల్లో కాళ్ళు, చేతులు పోయి, వెన్ను విరిగి కదల్లేని దీన స్థితిలో ఉన్న కార్మికులకు కూడా సంక్షేమ నిధి నుండి కేటాయింపులు చేయలేని స్థితి. ఆటో కార్మికుల్లో కొందరికి సంవత్సరానికి రూ. 10 వేలు ఇచ్చామని వైసిపి నాయకులు చెబుతున్నారు. ఆచరణల్లో ప్రభుత్వం రూ. 10 వేలు ఒక వైపు ఇస్తూ మరో వైపు విపరీతంగా ఫైన్లను పెంచడం వల్ల తమ జీవితం భారమైందని ఆటో కార్మికులు అంటున్నారు.

ప్ర: సిఐటియు నిర్వహించిన ఇతర పోరాటాలేమిటి?

జ: సిఐటియు అన్ని తరగతుల కార్మికుల సమస్యలపై ఎక్కడికక్కడ ఉద్యమాలు నిర్వహించింది. కృష్ణపట్నం పోర్టులోనూ, థర్మల్ కేంద్రంలోనూ సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు ఇప్పటికీ జరుగుతున్నాయి. తెలంగాణాలో లాగా తమ వేతనాలను పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, గ్రాట్యూటీ చెల్లించాలని స్కీమ్ వర్కర్లు అనేక సార్లు నిర్బంధాలను ఎదుర్కొంటూ పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. పెరల్స్, విజయడైరీ, హెచ్‌పిసిఎల్, కర్నూల్ మార్కెట్ యార్డు కార్మికులు కరోనా కాలంలో కూడా పెద్ద ఎత్తున ప్రతిఘటన పోరాటాలతో తమ హక్కులను కాపాడుకునేందుకు అనేక పోరాటాలు చేశారు. టిటిడిలో ఫారెస్టు కార్మికులు తమ సమస్యలపై దీర్ఘకాలంగా చేస్తున్న ఆందోళనలు నేటికీ కొనసాగుతున్నాయి. విశాఖ ఉక్కు కార్మికులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశంలోనే ఆదర్శవంతమైన ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. రాబోవు కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడిని పెంచి కార్మిక హక్కులను సాధించుకునేందుకు, మెరుగైన జీవితాన్ని పొందేందుకు కార్మికవర్గ పోరాటాలకు భీమవరం మహాసభ నిర్దిష్ట రూపాన్ని ఇవ్వబోతోంది. రాబోవు కాలంలో కార్మిక సంఘాలన్నింటినీ ఒక విశాల వేదికపై సమీకరించేందుకు సమరశీల పోరాటాలను నిర్మించేందుకు దిశా నిర్దేశం చేస్తుంది.

మళ్లీ తొక్కిసలాట

(మొదటి పేజీ తరువాయి)

ఒకరు పడిపోయారు. ఊపిరాడక హాహాకారాలు చేశారు. రమాదేవి అనే మహిళ సంఘటనా స్థలంలోనే తుదిశ్వాస విడిచింది. తీవ్ర అస్వస్థతకు గురైన నలుగురిని గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. అక్కడ చికిత్స పొందే క్రమంలో ఇద్దరు మరణించారు. మిగతా ఇద్దరి పరిస్థితీ విషమంగా ఉంది. ఘటన జరిగిన తర్వాత ఆ ప్రాంగణాన్ని పోలీసులు ఖాళీ చేయించారు. ఘటనా స్థలిని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, ఎస్‌పి ఆరీఫ్ హాఫీజ్, ఆర్‌డిఓ ప్రభాకరరెడ్డి పరిశీలించారు. బాధితులను రాష్ట్ర, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, డొక్కా మాణిక్యవర ప్రసాద్ పరామర్శించారు.

టోకెన్లు జారీ చేసిన దాని కంటే ఎక్కువమంది వచ్చారు : ఫౌండేషన్

తాము పంపిణీ చేసిన టోకెన్ల కంటే ఎక్కువ మంది రావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని ఉయ్యూరు ఫౌండేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలో గత రెండేళ్లుగా ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపింది. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వచ్చిపోయాక ఈ దుర్ఘటన చోటుచేసుకుందని పేర్కొంది.

శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానము
పొలతల, గంగనపల్లె (గ్రా),
పెండ్లిమర్రి (మం), కడప జిల్లా.
e-Procurement Tender
NIT No. Human Hair/2022 Dt. 31-12-2022
దేవస్థానము నందు తలనీలాలు సేకరించుకొను హక్కు (ఒక సంవత్సరముపాటు) అనగా 01-02-2023 నుండి 31-01-2024 వరకు కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు www.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
ఇట్లు, కార్యనిర్వహణాధికారి

బిజెపి సీనియర్ నేత పివి చలపతిరావు మృతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

బిజెపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ పివి చలపతిరావు (88) కన్నుమూశారు. కొంతకాలం కిందట అస్వస్థతకు గురై నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించి ఆదివారం మధ్యాహ్నం మృతిచెందారు. భౌతికకాయాన్ని పిఠాపురం కాలనీలోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చలపతిరావుకు భార్య అనురాధ (రిటైర్డ్ లైబ్రేరియన్), కుమార్తెలు అంజనా ఉపాధ్యాయ, అపర్ణా ముఖర్జీ, కుమారుడు పివిఎన్ మాధవ్ ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షునిగా చలపతిరావు 1980, 1985ల్లో రెండు పర్యాయాలు పనిచేశారు. జనసంఘ్‌లో ఉండగా 1974లోనూ, బిజెపిలో ఉండగా 1984లోనూ ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.

పివి.చలపతిరావు (ఫైల్)

బిజెపి ఆరు జిల్లాల అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆరు జిల్లాలకు పార్టీ కొత్త అధ్యక్షలను నియమిస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం అధ్యక్షునిగా బి.ఉమామహేశ్వరరావు, అనకాపల్లికి డి.పరమేశ్వరరావు, రాజమండ్రికి బొమ్ముల దత్తు, మచిలీపట్నానికి గుత్తికొండ రాజబాబు, నరసరావుపేటకు అలోకం సుధాకర్, ఒంగోలుకు శివారెడ్డిని నియమించారు. వీరితో బాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ప్రకటించారు. శ్రీకాకుళానికి అట్టాడ రవి, అనకాపల్లికి డాక్టర్ గాంధీ సత్యనారాయణ, రాజమండ్రికి పరిమి రాధాకృష్ణ, మచిలీపట్నానికి మట్టా ప్రసాద్, నరసరావుపేటకు కర్నా అమరశ్యాదరావు, ఒంగోలుకు సిరసనగండ్ల శ్రీనివాసులును నియమించారు.

ఆర్‌టిసి కార్గోకు దేశవ్యాప్త గుర్తింపు

- ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్ ఆర్‌టిసి నిర్వహించే కార్గో సేవలు సిబ్బంది అందరి కృషితో ప్రజలకు చేరువ కావడంతోపాటు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధించాయని ఎపిఎస్ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు తెలిపారు. 2023లోనూ ఇదే స్ఫూర్తితో పనిచేసి ఆర్‌టిసికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. విజయవాడలోని ఆర్‌టిసి హెడ్‌క్వార్టర్స్‌లో ఆదివారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ద్వారకా తిరుమలరావు కేక్ కట్ చేసి మాట్లాడారు. ఆర్‌టిసికి 2022 సంవత్సరం గుర్తుంచుకోవాల్సిన సంవత్సరమని అన్నారు. రెవెన్యూపరంగా కార్గో ఆదాయం బాగా పెరిగిందని చెప్పారు. కార్గోను డోర్ డెలివరీ స్థాయికి తీసుకెళ్లామని తెలిపారు. సాంకేతికంగా కూడా అభివృద్ధి చేశామన్నారు. రిజర్వేషన్, ట్రాకింగ్ లాంటి అంశాల్లో ప్రవేశపెట్టిన అడ్వాన్స్ సాంకేతిక పరిజ్ఞానం సత్ఫలితాలను ఇచ్చిందని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. పిఎఫ్, సిసిఎస్ బకాయిలను చెల్లించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఆర్‌టిసి ఉద్యోగుల ఆరోగ్య సమస్యల పట్ల ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎ.కోటేశ్వరరావు, కెఎస్ బ్రహ్మానందరెడ్డి, కార్గో ఓఎస్‌డి రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

దేశం నూతన సవాళ్లను ఎదుర్కొంటోంది

- రక్షించుకోవాల్సిన బాధ్యత మనదే.. • సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు
- ఆకట్టుకున్న 'ఆట, పాట, మాట' కార్యక్రమం

డప్పు కొట్టి సాంస్కతిక కార్యక్రమాలను ప్రారంభిస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

దేశ సార్వభౌమాధికారం, ప్రజాస్వామ్యం, భిన్నత్వంలో ఏకత్వం, భారత రాజ్యాంగం వంటి దేశ మూల స్తంభాలు నేటి పాలకుల విధానాల వల్ల దెబ్బతింటున్నాయని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. వీటిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను పురస్కరించుకుని పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని కేశవరావు హైస్కూల్ ఆవరణలో ప్రజానాట్య మండలి ఆధ్వర్యాన ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ఆట, పాట, మాట కార్యక్రమాన్ని ఆయన డప్పు వాయించి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. దేశం నూతన సవాళ్లను ఎదుర్కొంటోందని తెలిపారు. పెరిగిన ధరలు, నిరుద్యోగం, పరిశ్రమల మూతతో కొనుగోలు శక్తి తగ్గి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయన్నారు. రైతాంగం ఎవరూ సుభిక్షంగాలేరని, వ్యవసాయరంగ కార్మికులు, ప్రజా జీవనం సైతం అతలాకుతలంగా మారింది తెలిపారు. దీనికి కారకులు ఎవరని ప్రశ్నించుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. కార్మిక, ప్రజా సమస్యలతోపాటు దేశ పరిరక్షణ కూడా మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర పూర్వ కార్యదర్శి మంతెన సీతారాం, సిఐటియు రాష్ట్ర నాయకులు నూర్ మహ్మద్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు

సిఐటియు రాష్ట్ర మహాసభ సందర్భంగా ప్రజానాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, గేయాలు అందరినీ కట్టుకున్నాయి. గురజాడ మా అడుగుజాడ, దేశం అంటే మట్టి కాదు, మాకొద్దు నల్ల దొర తనము, కార్మిక కదంబం, చమట చుక్కా వంటి సాంస్కృతిక నృత్యాలు, ఆజాది డ్యాన్స్, ఆవాజ్ దో హమ్ ఏక్‌హై డాన్స్‌లు అందర్నీ ఆలోచింపజేశాయి. ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.మంగరాజు, ఎస్.అనిల్ కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ వలి, చైతన్య ప్రసాద్ పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలకు

ఉద్యోగులు దూరం

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

నూతన సంవత్సర వేడుకలు 2023కు కర్నూలు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వోద్యోగులు దూరంగా ఉన్నారు. ఎపి ఉద్యోగ ఉపాధ్యాయ ఐకాస జెఎసి నేతలు ముందుగానే కర్నూలు జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవడం లేదని ప్రకటించారు.

అందుకనుగుణంగానే ఏ ఒక్క ఉద్యోగ సంఘం నాయకులు, ఉద్యోగులు తమ కార్యాలయాలకు వచ్చి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోలేదు. జనవరి ఫస్ట్ ఆదివారం వచ్చినా ఎన్‌జిఒలు తమ కార్యాలయాలకు వెళ్లడం, జిల్లా కలెక్టర్‌ను, ఇతర ఉన్నతాధికారులకు వారి కార్యాలయాల్లో కలిసి శుభాకాంక్షలు తెలియడం ఎప్పటి నుంచో ఆనవాయితీగా వస్తోంది. ఈసారి మాత్రం ఎన్‌జిఒలు ఎవరూ తమ కార్యాలయాలకు వెళ్లడంగానీ, అధికారులను కలిసి శుభాకాంక్షలు తెలియజేయడంగానీ చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు బకాయిలను చెల్లించకపోవడంతో ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారు. జనవరి ఒకటో తారీఖు వచ్చినప్పటికీ ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలు, పెన్షన్ కూడా రాకపోవడంతో ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవహార శైలిని నిరసిస్తూ ఏ ఒక్క ఉద్యోగి నూతన సంవత్సర వేడుకలు జరుపుకోలేదు.

పింఛనులో వంచన

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికారంలోకి వస్తే రూ.3 వేలు పింఛను ఇస్తానని నమ్మించిన జగన్ నయవంచన చేశారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఆరోపించారు. మొదటి ఏడాది నుంచే రూ.3 వేలు ఇచ్చి ఉంటే ఒక్కో పింఛనుదారుడికీ రూ.1.80 లక్షల లబ్ధి కలిగేదని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సగటున ఒక్కో పింఛనుదారుడికీ రూ.45 వేలు నష్టం కలిగిందని విమర్శించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఉంటే మొదటి ఏడాది నుంచే రూ.3వేల చొప్పున ఐదేళ్లలో రూ.1.80లక్షల లబ్ధి జరిగేదని తెలిపారు. పెన్షన్లు పెంచుతున్నామంటూ పత్రికల్లో ప్రకటనలకు రూ.100కోట్లు దుబారా చేశారని ఆరోపించారు. జగన్ అధికారంలోకి వచ్చాక రూ.2.50 లక్షల రేషన్ కార్డులకు కోత పెట్టారని, రేషన్ సరుకులు ఎత్తేశారని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణం పేరుతో లబ్ధిదారుల్ని అప్పుల పాలు చేశారని ఆరోపించారు. ఒటిఎస్ పేరుతో రూ.10 - రూ.30 వేల చొప్పున బలవంతంగా వసూలు చేశారని విమర్శించారు. ఆరోగ్యశ్రీ కార్డుదారులకు లింక్ ఆస్పత్రుల్లో వైద్యం కోసం చేర్చుకోవడం లేదని ఆరోపించారు.

పెన్షన్లలో దొంగనోట్ల పంపిణీ: బిటి నాయుడు

మున్సిపల్ శాఖమంత్రి ఆదిమూలపు సురేష్ నియోజకవర్గం యర్రగొండపాలెంలో వలంటీర్లతో ప్రజలకు దొంగనోట్లు పంపిణీ చేయిస్తున్నారని టిడిపి ఎమ్మెల్సీ బిటి నాయుడు ఆరోపించారు. వీటి వెనుక ఎవరున్నారో గుర్తించి అధికారులు చర్యలు తీసుకోవాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. యర్రగొండపాలెంలోనే కాదని, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతోందని పేర్కొన్నారు. ఇది దేశభద్రతకు సంబంధించిన అంశమని, దీనిపై తక్షణమే సిబిఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

విశాఖకు మెట్రో... మరచిపో?

- విభజన హామీ... అయినా స్పందించని కేంద్రం...
- మెట్రో రైల్ కార్యాలయం పెట్టేసి చేతులు దులుపుకున్న రాష్ట్రం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎపి విభజన చట్టం హామీల్లో ప్రధానమైన విశాఖకు రైల్వే జోన్, మెట్రో రైల్ ఏర్పాటు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలపై కేంద్రంలోని బిజెపి సర్కారు నీళ్లు జల్లుతూ వస్తోంది. 2019 ఎన్నికల సమయంలో విశాఖకు రైల్వే జోన్ అంటూ మోడీ సర్కారు ప్రకటన చేసింది. 2021-2022 బడ్జెట్‌లో ఒక్కపైసా కూడా విదిలించలేదు. వాల్తేరు రైల్వే డివిజన్‌ను ఎత్తేసి ఈ ప్రాంత ప్రజలు, ఉత్తరాంధ్ర ప్రాంతంలో పనిచేసే రైల్వే ఉద్యోగులనూ మోసం చేసింది. కేంద్రం కోరిన మీదట విశాఖకు మెట్రో రైలుపై రూ.18వేల కోట్లు అవసరమవుతుందని రైల్వే నిపుణులు 2019లో ప్రతిపాదన పంపినా సరే కేంద్రం నుంచి ఇంతవరకూ స్పందన రాలేదు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం సైతం మెట్రోపై మౌనం దాల్చింది. విశాఖలోని ఎల్‌ఐసి భవన సముదాయంలో ఎపి మెట్రో రైల్ ప్రాజెక్టు కార్యాలయాన్ని 2020 అక్టోబర్ 26న అప్పటి రాష్ట్ర మునిసిపల్, పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అట్టహాసంగా ప్రారంభించారు. 2024 సంవత్సరానికల్లా మెట్రో పూర్తవుతుందని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సైతం ప్రకటించారు. కానీ ఆ దిశగా ఒక్క పనీ మొదలవ్వలేదు. రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వమూ మెట్రో కార్యాలయం అయితే పెట్టి అంతటితో పనైపోయిందంటూ చేతులు దులిపేసుకుంది. దేశం మొత్తం మీద ఎపి, ఒడిశాలో మాత్రమే మెట్రో రైలు లేని 'అర్బన్ సిటీస్' (పట్టణాలు) ఉన్నాయన్నది స్పష్టమవుతోంది.

75 కిలోమీటర్లు... 4 కారిడార్‌లు...

విశాఖ మెట్రో రీజనల్ డెవలప్‌మెంట్ ఏరియాలో 79.91 కి.మీ. లైట్ మెట్రో రైలు కారిడార్‌లు, 60 కి.మీ మేర మోడ్రన్ ట్రామ్ కారిడార్ల అభివృద్ధి కోసం ఆనాడే మాస్టర్ ప్లాన్, డిపిఆర్ తయారుచేశారు. లైట్ మెట్రో, మోడ్రన్ ట్రామ్‌ల నిమిత్తం రెండు డిపిఆర్‌లు వేర్వేరుగా తయారుచేసి ట్రాఫిక్ ఇతర అంశాలపై అధ్యయనం చేసిన అనంతరం 75.31 కిలోమీటర్లలో 4 కారిడార్లలో 52 స్టేషన్లను ఏర్పాటు చేయాలని నాటి కన్సల్టెంట్‌లు ఎపి ప్రభుత్వానికి, కేంద్రానికి సిఫారసు చేశారు. విశాఖ నగరంలో ఏ సమయంలో ఎక్కడెక్కడ ఎంత ట్రాఫిక్ ఉంటుందీ అన్న ప్రతిపాదనలూ కేంద్రానికి వెళ్లాయి. స్టీల్‌ప్లాంట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకూ ఒక కారిడార్, గురుద్వారా నుంచి పాత పోస్టాఫీస్ వరకూ, తాటిచెట్ల పాలెం నుంచి చినవాల్తేరు వరకూ, కొమ్మాది జంక్షన్ నుంచి భోగాపురం వరకూ 4 కారిడార్ల ఏర్పాటుకు అవసరమైన డిపిఆర్ సిద్ధమైంది.

మెట్రో వచ్చే దెప్పుడు? విశ్వనగరం అయ్యేదెప్పుడు?

ఈ మాటలు విశాఖ, ఉత్తరాంధ్ర ప్రాంతంలో తాజాగా వినబడుతున్నాయి. అమరావతి నిర్మాణానికే సాయం ఇవ్వకుండా చాపచుట్టేసిన కేంద్రం ఎపి మెట్రోకు రూ.వేలకోట్లు అందిస్తుందా? అన్నది అనుమానమే. విశాఖ నగరంలో జన సాంద్రత రీత్యా మెట్రో ఏనాడో పరుగులు తీయాలని గత చంద్రబాబు సర్కారు 2016 నుంచీ విశాఖకు మెట్రో అంటూ ఊరిస్తూ వచ్చారు. 2017 డిసెంబరులో మధురవాడ నుంచి గాజువాక 44 కి.మీ మెట్రో వేసేందుకు విజయవాడ-విశాఖ రైల్వే అధికారులతో చంద్రబాబు ప్రభుత్వం చర్చించింది.

అప్పట్లో కిలోమీటరుకు ఖర్చు రూ.200కోట్లుగా అంచనా వేశారు. అంటే 44 కి.మీ కు రూ.8500కోట్లు వ్యయం కానుంది. 2019 ఎన్నికల ప్రచారానికి ఉపయోగపడేలా 2018 డిసెంబరు నాటికి పనులు ప్రారంభించాలంటే చంద్రబాబు ఆదేశించినా ఒక్కపైసా కూడా కేంద్రం నుంచి రాలేదు. విశాఖలో 2028 సంవత్సరం నాటికి 144 కి.మీ మెట్రో పూర్తికావాలనే లక్ష్యాలను సైతం చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. అయితే దీనికి సంబంధించిన డిపిఆర్ తయారీకి రైల్వే నిపుణులు, ఒఎస్‌డి, సిఎమ్‌డిలను రాష్ట్ర ప్రభుత్వం నియమించాల్సి ఉన్నా ఆ దిశగా 2018 డిసెంబరు నాటికి జరగలేదు. దీంతో డిపిఆర్‌లో అంచనా వ్యయం కూడా తాజాగా రూ.18వేల కోట్లకు పెరిగిపోయింది. 2020లోపు చొరవ చేస్తేనే మెట్రోకు ఈ వ్యయం. ప్రస్తుత పరిస్థితుల్లో రూ.18వేల కోట్లకు మరో 30శాతం అదనపు ఖర్చు అవుతుందని రైల్వే నిపుణులు వెల్లడిస్తున్నారు. ప్రాథమికంగా విశాఖ మెట్రోపై జరిగిన అధ్యయంలో అండర్ గ్రౌండ్ నుంచి మెట్రో లైన్‌లు వెళ్తున్నప్పుడు పైన ఉన్న భవనాలకు పగుళ్లు ఏర్పడే అవకాశం లేకపోలేదనేది వాదన కూడా ఉంది.

విభజన హామీలను కేంద్రం అమలుచేయాలి : కొణతాల

ప్రజాశక్తి - అనకాపల్లి

రాష్ట్ర విభజన నేపథ్యంలో ఇచ్చిన హామీలను కేంద్రప్రభుత్వం ఇప్పటికైనా అమలు చేయాలని, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను నిలిపివేయాలని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ డిమాండ్ చేశారు. అనకాపల్లిలోని సుబ్రహ్మణ్యం ఘాట్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు అన్ని రాజకీయ పక్షాలను కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తేవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. విభజన హామీల్లో భాగంగా వెనుకబడిన ఉత్తరాంధ్రకు ప్రత్యేక నిధుల కేటాయింపు, వాల్తేరు డివిజన్‌తో కూడిన విశాఖ రైల్వే జోన్ తదితర అంశాలేవీ అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ కాస్తోకూస్తో భూములు ఉన్నవారు సైతం వలస కూలీలుగా మారుతున్నారని తెలిపారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, మూతపడ్డ ఫ్యాక్టరీలను తెరిపించాలని డిమాండ్ చేశారు. ఫార్మా కంపెనీల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఉత్తరాంధ్ర చర్చా వేదిక నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి

రెవెన్యూ డైరీ, కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రెవెన్యూ డైరీ-2023, క్యాలెండర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆవిష్కరించారు. నూతన సంవత్సరం సందర్భంగా విజయవాడలోని సిఎస్ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఎపి జెఎసి అమరావతి ఆధ్వర్యాన రూపొందించిన డైరీని ఆయన ఆవిష్కరించారు. డైరీలో 2022 వరకు ప్రభుత్వం విడుదల చేసిన రెవెన్యూ చట్టాలు, అన్ని జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఆర్‌డిఒల సమాచారాన్ని క్రోడీకరించామని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.గిరికుమార్‌రెడ్డి, ఎన్ శ్రీనివాస్, ఆర్.రాజేష్, ఎం.మాధురి, జి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఇ.ఫణికుమార్, ఎపి గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. ఆంజనేయకుమార్, కార్యదర్శి సాంబశివరావు, విఆర్‌ఎ రాష్ట్ర అధ్యక్షులు జయరాజు, వెంకటరావు, ఎపిజెఎసి నాయకులు టివి ఫణిపేర్రాజు, వివి మురళీకృష్ణ నాయుడు, కె.మల్లీశ్వరరావు, బి.కిషోర్‌కుమార్, కెపి చంద్రశేఖర్, మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.ఈశ్వర్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వి.ఆర్గయ్య, కోశాధికారి బగ్గా జగదీష్ పాల్గొన్నారు.

ప్రాణాలర్పించైనా కాపు రిజర్వేషన్ సాధిస్తా

- మాజీ మంత్రి హరిరామజోగయ్య
- నేటి నుంచి నిరవధిక నిరాహార దీక్ష

ప్రజాశక్తి - పాలకొల్లు

తన ప్రాణాలు పోయినా కాపు రిజర్వేషన్ సాధిస్తానని మాజీ మంత్రి చేగొండి హరరామజోగయ్య అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని తన స్వగృహంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇడబ్ల్యుఎస్ కోటాలో కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని డిసెంబర్ 30వ తేదీ అంతిమ గడువుగా ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్‌కు లేఖ రాశానని, అయినా స్పందన లేదని తెలిపారు. దీంతో తాను 2వ తేదీ ఉదయం తొమ్మిది గంటల నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. తన దీక్షకు వచ్చే అభిమానులను అడ్డగిస్తే ఊరుకునేనిలేదని హెచ్చరించారు. నిరాహార దీక్షకు అనుమతి కోరినా పోలీసులు ఇవ్వలేదని తెలిపారు. దీక్ష చేపట్టొద్దని జోగయ్యను పాలకొల్లు ఎస్ఐ శ్రీనివాస్ కలిసి అభ్యర్థించారు. దీనిపై జోగయ్య స్పందిస్తూ దీక్షకు ఆటంకం కలిగించినా, తన కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసినా తగిన పరిహారం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

గ్యాస్ బాదుడు మళ్లీ మొదలు

- కొత్త ఏడాది తొలిరోజే కమర్షియల్ సిలిండర్‌పై రూ.25 పెంపు

న్యూఢిల్లీ : కొత్త సంవత్సరం తొలి రోజే కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌పై రూ.25 పెరిగింది. ఆయిల్ కంపెనీలు 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరల్ని పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న ధరలపై రూ.25 చొప్పున పెంచాయి.

దీంతో, హోటళ్లు, ఇతర ప్రాంతాల్లో భోజన, ఫలహారాలు కొనుగోలు చేసే సగటు వినియోగదారులపై మరింత భారం పడనుంది. గృహ వినియోగదారుల గ్యాస్ ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. చివరిసారిగా గతేడాది ఏడాది జులై 6న రూ.50 పెరగ్గా.. మొత్తంగా గతేడాది కాలంలో గహావసర గ్యాస్ సిలిండర్ల ధరలు రూ.153.5 చొప్పున పెరిగాయి. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో రూ.1053 నుంచి రూ.1105 వరకూ ఉన్నాయి.

పోర్టు కార్మికులకు భద్రత కరువు

- అందని కనీస కూలి
- పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు నిల్
- పట్టించుకోని కార్మిక శాఖ

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

పోర్టు కార్మికులకు ఆర్థిక, భౌతిక భద్రత కరువైంది. కార్మిక చట్టాల అమలు మచ్చుకు కూడా కానరావట్లేదు. కనీసం కూలి రేట్లనూ అమలు చేసే పరిస్థితి లేదు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే దానికి బాధ్యత వహించి కార్మికులను ఆదుకునేవారే కరువయ్యారు. గత్యంతరంలేని పరిస్థితుల్లో కార్మికులు బానిసల్లా పనిచేయాల్సి వస్తోంది. కాకినాడ యాంకరేజ్ పోర్టులో ఎగుమతి, దిగుమతి కూలీలతోపాటు సర్వేయర్ అండ్ టాలీ, బాలబంధు (బస్తాలు కుట్టేవారు), స్వీపర్లు, బార్జీలకు పెయింటింగ్, ఫిట్టింగ్ పనులు చేసే ఫ్యాబ్రికేటర్లు ఇలా మొత్తంగా దాదాపు నాలుగు వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. రోజుకు ఎనిమిది నుంచి 12 గంటల పాటు రెక్కలు ముక్కలు చేసుకుని పగలనకా, రాత్రనకా కష్టపడ పనిచేస్తోన్నా వీరికి కనీస వేతనాలు అందడం లేదు. సర్వే అండ్ టాలీ వర్కర్లు మధ్యవర్తి ద్వారా పనులకు వెళుతున్నారు. వీరికి రూ.300 మాత్రమే కూలి వస్తోంది. ప్రతి కార్మికుల వద్ద మధ్యవర్తి రూ.50 కమిషన్‌గా తీసుకోగా, వారి చేతికి రూ.250 మాత్రమే అందుతోంది. కార్మికుల శ్రమను పోర్టులోని కాంట్రాక్ట్ సంస్థలు దోచుకుంటున్నాయి. కనీస వేతనాలు ఇవ్వడం లేదు. పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించకుండా తప్పించుకొనేందుకు యాజమాన్యం మధ్యవర్తుల ద్వారా కార్మికులను పనుల్లో పెట్టుకుంటోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా కనీసం ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య సాయం అందించే పరిస్థితి కూడా లేదు. కార్మికులకు ప్రభుత్వం నుంచి సౌకర్యాలు అందేలా, భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాల్సిన కార్మిక, పరిశ్రమ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదంటూ పోర్టు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాకినాడ యాంకరేజ్ పోర్టులో పనిచేస్తున్న కార్మికులు

గతేడాది ఆగస్టు 20న కాకినాడ పోర్టు రైల్వే స్టేషన్ సమీపంలో సముద్రంలో సరుకు రవాణా చేసే నౌక (బార్జి) ఫ్యాబ్రికేషన్ మరమ్మతు పనుల నిమిత్తం వెలుపలికి దిగి వెల్లింగ్ చేస్తుండగా గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో కాకినాడ ఏటిమొగకు చెందిన బలసాటి దుర్గాప్రసాద్ (26), జగన్నాథపురం గ్రామానికి చెందిన సూరిమళ్ల రాకేష్ (17), పోలవరపు శ్రీనివాస్ (32) సజీవ దహనమయ్యారు. యాజమాన్యం సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని తోటి కార్మికులు తెలిపారు. వీరికి పిఎఫ్, ఇఎస్ఐ వంటి కనీస సౌకర్యాలు కూడా లేవు.

ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయమూ అందలేదు. సిఐటియు నాయకులు పట్టుబట్టి చర్చలు చేయడంతో కుటుంబసభ్యులకు కొంత ఆర్థిక సాయం అందింది. కాకినాడ యాంకరేజ్ పోర్టు యాజమాన్యం కార్మికుల భద్రతను గాలికొదిలి వ్యవహరిస్తోందనడానికి ఈ సంఘటన తాజా నిదర్శనంగా నిలుస్తోంది.

కనీస కూలి అందట్లేదు

పోర్టులో క్వాలిటీ, క్వాంటిటీ విభాగంలో 30 ఏళ్లుగా పనిచేస్తున్నాను. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయి తప్ప కూలి మాత్రం పెరగడం లేదు. ప్రస్తుతం రోజుకు రూ.250 మాత్రమే వస్తోంది. పని ప్రదేశంలో ప్రమాదం జరిగితే పట్టించుకొనే వారు కరువయ్యారు. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు లేక ప్రభుత్వం నుంచి బెనిఫిట్స్ కోల్పోతున్నాం.

- పెండెం సూర్యారావు, సర్వేయర్స్ అండ్ టాలీ కార్మికుడు

ప్రమాదపు అంచుల్లో పనిచేస్తున్నాం

పొట్ట కూటి కోసం తప్పనిసరి పరిస్థితుల్లో ప్రమాదమని తెలిసినా బార్జీలకు వెల్డింగ్, పెయింటింగ్, ఫిట్టింగ్ పనులు చేస్తున్నాం. తరచూ ఏదొక ప్రమాదం జరుగుతోంది. మేమే సొంతంగా ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వస్తోంది. ఎవరూ పట్టించుకోవడం లేదు. రోజుకి రూ.500 మించి కూలి రావడం లేదు. కాంట్రాక్టు సంస్థ పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించడం లేదు.

- బివి.రమణ, ఫ్యాబ్రికేషన్ వర్కర్

'హైడ్రో' ప్రాజెక్టులపై వేగంగా అడుగులు

- భూమి, మౌలిక సదుపాయాలన్నీ ప్రభుత్వమే సమకూర్చాలంటున్న అదానీ!
- నీటి సామర్థ్యంపై నివేదిక కోరిన సర్కార్

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని పాడేరు ఏజెన్సీ అనంతగిరి మండలం పెదకోట, మైదాన ప్రాంతంలోని రైవాడ వద్ద ప్రతిపాదిత పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అడుగులు వేగంగా పడుతున్నాయి. పాడేరు ఏజెన్సీలో ఐదో షెడ్యూల్ పరిధిలోని చింతపల్లి మండలం ఎర్రవరం వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టును గిరిజనులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు.

ప్రాజెక్టు నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. అదానీకి చెందిన అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఇజిఇఎల్)కు అనుమతులు మంజూరు చేసేసింది. పెదకోట, రైవాడల్లో నీటి సామర్థ్య పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని కొద్ది రోజుల క్రితం నీటిపారుదల శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ నూతన, పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (నెడ్‌క్యాప్) నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. 2019 డిసెంబరులో తయారు చేసిన ప్రాథమిక అంచనా ప్రకారం... పెదకోట వద్ద వెయ్యి మెగావాట్ల హైడ్రో విద్యుత్ ప్రాజెక్టుకు రూ.3,890 కోట్లు ఖర్చు కానుంది.

ఇక్కడ ఏర్పాటు చేసే పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి 683 ఎకరాలు, ట్రాన్స్‌మిషన్ లైన్ల ఏర్పాటుకు మరో 760 ఎకరాలు అవసరం. రైవాడ వద్ద రూ.2,440 కోట్ల విలువైన 600 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు 683 ఎకరాలు, ట్రాన్స్‌మిషన్ లైన్ల ఏర్పాటుకు మరో 760 ఎకరాలు అవసరమని ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో పెదకోట, రైవాడ వద్ద నీటి సామర్థ్య పరిస్థితిపై నివేదిక ఇచ్చే పనిలో నీటిపారుదల శాఖాధికారులు ఉన్నారు. ఈ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అదానీ అనేక రాయితీలు, సదుపాయాలు కోరినట్లు తెలిసింది. ఏజెన్సీలోనూ, మైదాన ప్రాంతంలోనూ ఈ ప్రాజెక్టులకు అవసరమైన భూమి, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలను ప్రభుత్వమే సమకూర్చాలని కోరినట్లు సమాచారం.



పెదకోట వద్ద ఏర్పాటు చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టు స్థలం

ప్రాజెక్టు ఏర్పాటుకు కొనుగోలు చేసే నిర్మాణ, యంత్ర సామగ్రిపై వంద శాతం జిఎస్‌టి మినహాయింపును అడిగినట్లు తెలిసింది. సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగంలో భాగంగా పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అవసరమైన ప్రోత్సాహం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ద్వారా ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఎర్రవరం వద్ద పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటును శ్రీ షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్‌కు, పెదకోట, రైవాడ వద్ద ఏర్పాటు చేసే ప్రాజెక్టులను అదానీకి అప్పగిస్తూ గత నెల 13న జరిగిన మంత్రివర్గం సమావేశంలో ఆమోదించిన తరువాత ఈ వేగం కాస్త పెరిగింది.

లక్ష్యాలతో కలుద్దాం!

హ్యాపీ న్యూ ఇయర్.. ఎవడో ఇస్తే ..
నోట్లో వేసుకునే మిఠాయి కాదు
ఒక కొత్తదనం .. ఇంకో జవసత్వం
జనం గుండె గొంతుక నుంచి ధ్వనించాలి
దేశం దేహ భక్తి ఒంటి నిండా నింపుకుంటూ
గుండె గదుల్లో చెరగకుండా హత్తుకుంటూ
రండి.. కదం తొక్కండి.. పిడికెళ్ళెత్తి కదలండి

ఆడపిల్ల సింబల్ ఆఫ్ సెక్సు కాదనీ
నీ బతుకునిచ్చిన జన్మ చిహ్నమనీ
గర్వంగా జాతి జెండాగా ఎగరేద్దాం
మత్తు ముఠాల్లో మృగాళ్ల నేరేద్దాం
రేపుల్లేని హ్యాపీ న్యూగా ప్రకటిద్దాం
రండి.. లెగవండి.. ఇక చాటింపేద్దాం

పాలక విధానాల కత్తిపోట్లకు గురై
ఎరువైన రైతన్న వెన్నెముకను తీసి
నాగలిగా మారుద్దాం .. పొలాన్ని దున్నేద్దాం
చెమట ధారల ఒడిసిపట్టి చేలంతా చల్లేద్దాం
భూమి, పంట, ధర.. రైతు హక్కని ప్రకటిద్దాం
రండి.. కదలండి.. పచ్చ తివాచీలు పరుద్దాం

ప్రజల చెమటే ప్రభుత్వ రంగంగా పెంచినోటిని
కమ్మేసిన కార్పొరేట్ రాబందుల గుంపుకు
కారు చౌక వేలంతో అప్పనంగా అమ్మేస్తుంటే
చూస్తుండే శవాలు లేవిక్కడని చాటింపేద్దాం
అది జనం గుత్త సొత్తని ప్రకటిద్దాం సాధిద్దాం
ఇదే కొత్త సంవత్సర లక్ష్య పతాకగ ఎగరేద్దాం

అప్పుడందాం.. హ్యాపీ హ్యాపీ న్యూ ఇయర్
ఇక భవిష్యత్తు.. మనదే మనదే డియర్ అని!

– ఉన్నం వెంకటేశ్వర్లు



కెరటమై ఎగిసిపడాల్సిందే!

నువ్వు జారిపడ్డానవి భయపడకు
నీ తలకు తగిలిన గాయానికి
స్రవించిన ఆ రక్తం నాదేనని
ఇద్దరి కళ్ళల్లో నుంచి వచ్చే ఆ కన్నీళ్ళకూ తెలుసు
ఒకే లయలో కొట్టుకుంటున్న ఆ గుండెకీ తెలుసు
తడబడినా సరిచేసుకుంటున్న చేతులకూ తెలుసు
నువ్వు జారిపడ్డానవి భయపడకు
నడవడం మొదలెడితేనే కదా తెలిసేది
నీ మార్గంలో లోయలున్నాయో
నీ పయనంలో శిఖరాలున్నాయో
నువ్వు విజేతవో పరాజితవో తెలిసేది

నిన్ను మళ్ళీ నా చేతుల్లోకి తీసుకుంటాను
నువ్వు పోరాడినంతకాలమూ
నిన్ను మళ్ళీ మళ్ళీ నాచేతుల్లోకి తీసుకుంటాను
నేను జారవిడుకున్న జీవితాన్నీ
నేను పోగొట్టుకోలేక పోరాడిన ఆత్మగౌరవాన్నీ
మళ్ళీ నీకిస్తూ ముద్దులతో అభిషేకిస్తున్నాను

నువ్వు పడినప్పుడల్లా
రెట్టింపు ఉత్సాహంతో పైకి లేవాలి
నిన్ను జాతి పేరుతోనో
కులం, మతం, జెండర్ పేర్లేమైతేనేమి
నీ ఆత్మగౌరవాన్నంతటినీ
ప్రోది చేసుకొంటూ మళ్ళీ లేవాలి
పుడుతూనే నేనూ నువ్వూ
మెత్తని పరుపులపై పడలేదు
నిత్యం వేదాశీర్వాదాలు
మంగళ ధ్వనులు వినిపించే
మున్యాశ్రమంలోనూ పడలేదు
ఈ భూమిపై పడగానే పడగలెత్తి బుసకొట్టే
యుద్ధక్షేత్రంలోనే పడ్డామని మరిచిపోకు
ఈ యుద్ధం ఆ దుమ్మూ, ఈ ధూళీ
వారసత్వంగా మోసుకెళ్ళాలంటుంది
ఈ యుద్ధంలో మాయల్నీ మంత్రాల్నీ
అధికార సమ్మోహాల్నీ ఎరవేస్తుందేమో
మళ్ళీ తుళ్ళిపడిపోతావేమో
మళ్ళీ మళ్ళీ నువ్వు నిలబడ్డ నేలను ముద్దాడు

నువ్వైనా నేనైనా ఎవరైనా సరే
తలెత్తుకొని నిలబడ్డం కోసం
నిరంతరం యుద్ధం చెయ్యాల్సిందే
అవమానితులెందరో నిన్నే చూస్తున్నారు
అనుమానితులెందరో
నువ్వేంటే నిరూపించమంటున్నారు
అనునిత్యం నిన్నే తలుచుకునే
ఆశావాహులెందరో నువ్వై పోరాడుతున్నారు
నువ్వొంటరివి కాదు
నువ్వే మా సామూహిక స్వప్నానివి

నిన్ను మళ్ళీ నా చేతుల్లోకి తీసుకుంటాను
నువ్వు పోరాడినంతకాలమూ
నిన్ను మళ్ళీ మళ్ళీ నాచేతుల్లోకి తీసుకుంటాను
నేను జారవిడుకున్న జీవితాన్నీ
నేను పోగొట్టుకోలేక పోరాడిన ఆత్మగౌరవాన్నీ
మళ్ళీ నీకిస్తూ ముద్దులతో అభిషేకిస్తున్నాను.

– దార్ల వెంకటేశ్వరరావు
91826 85231

“ఏ కృతికి ఆ కృతే భాష్యం.
కృతికర్త చెప్పలేని ఏ విషయాన్నీ
భాష్యకారుడు చెప్పలేడు. పైగా
అందులోని మృదుత్వాన్ని
చెరుస్తాడు.”
– ఆలూరి బైరాగి

రాసాని కథల్లో సాంస్కృతిక నేపథ్యం

సమీక్ష

మనకు తెలిసిన ప్రపంచం ఒకటుంటుంది. తెలియని ప్రపంచం ఒకటి ఉంటుంది .తెలిసి తెలియని ప్రపంచం ఒకటి ఉంటుంది. కథకుల్లో కొందరు తెలియని ప్రపంచం గురించి తెలిసేలా రాస్తారు .కొందరు కథకులు తెలిసిన ప్రపంచం గురించే భిన్నంగా రాస్తారు. ఏ రచయిత అయినా తన రచన పాఠకుల హృదయాల్లో తిష్ట వేయాలని చూస్తారు. ఎంచుకున్న ఇతివృత్తాన్ని ఫలవంతంగా పాఠకుడిలోకి ప్రయాణం చేయించగలగాలి. సమస్యా పరిష్కార పద్ధతిలో కథలు రాసే కాలం కాదిది. ఆ పద్ధతిలో కథలు రాస్తే కథకి ఆయుష్షు తగ్గిపోతుంది. కథకి ఓ జీవరేఖ ఉండాలి.

చిత్తూరు జిల్లా గ్రామీణ జీవితాన్ని తన కథల ద్వారా సాహిత్య లోకానికి అందించిన రచయిత రాసాని. సంచార జాతుల బతుకులు బయట ప్రపంచానికి చూపించడంలో విజయం సాధించిన కథకుడు. ఆయన కథలో అన్వేషణ, పరిశీలన, పరిశోధన ప్రధానంగా కనిపిస్తాయి. ఆ కథలకు ఏ భాష ఇవ్వాలో రాసానికి తెలుసు. భాష కథను ప్రవహింపచేస్తుంది. ప్రసరింప చేస్తుంది. ఏకబిగిన చివరికి లాక్కెళ్ళే కాంతి కదా భాష. మాండలిక భాషను ప్రభావవంతంగా వాడి కథన సౌందర్యాన్ని ఆవిష్కరించడంలో రాసాని కృతకృత్యులయ్యారు. రాసాని కళా సూత్ర జ్ఞానం కలిగిన కథకుడు. సామాజికాభ్యుదయాన్ని ఆకాంక్షించే ఆరాటం కలిగిన మనిషి. ఆయన కథా వస్తువు కోసం తన చుట్టూనే చూస్తాడు. తన చుట్టూ ఉన్న పరిసరాలు ఆయన పరిధి .స్వతంత్ర దృక్పథంతో అప్పటిదాకా వెలుగు చూడని జీవిత కోణాలను సమాజంలోని జీవితాలను చూపిస్తూ ఈ కథకుడు ముందుకు నడుస్తున్నాడు .

రాసాని రాసిన తపస్సు కథ చిత్తూరు జిల్లా ప్రాంతానికి చెందింది. చిత్తూరులో జరిగే భారతం తిరణాలు ఉత్సవంలో జరిగే సాంప్రదాయ కళ. తపస్సమాను ఎక్కే కళాకారుడు జీవితం గురించి రాసిన కథ. ఆ కథలో ఆరోజు తపస్సుని అధిరోహించాల్సిన సిద్దుగోడు లేకపోవడంతో గతంలో ఎన్నోసార్లు ఎక్కి ఇప్పుడు వయసైపోయిన రంగప్పకి అనుకోకుండా అవకాశం వస్తుంది. రంగప్ప జీవితం



గందరగోళంగా ఉంది. డబ్బు అవసరం ఉంది తపసుమాను ఎక్కితే వచ్చే సొమ్ము ద్వారా కొన్ని కష్టాలు తీరవచ్చు అనే ఆశ అతన్ని ఒప్పుకునేలా చేసింది. తపసుమాను ఇంద్రకీలాద్రి పర్వతానికి ప్రతీక. చాలా పొడవైన అశోక వృక్షాన్ని తపస్సుమానుగా నాటారు. తపస్సు మాను ఎక్కాక టెంకాయ కొట్టి ముక్కలు చేసి అరటి పండ్లు, నిమ్మకాయలు, మిఠాయిలు, బొరుగులు, విభూది అన్నీ కలిపి భక్తుల మీద చల్లుతారు. అవి దొరికిన వాళ్లకి కష్టాలు తీరుతాయని అక్కడికి విశ్వాసం. ఈ కథను రాసాని సమర్థవంతంగా నడిపాడు. తపసుమాను ఎక్కిన రంగప్ప లోపల జరిగే అంత్ణ సంఘర్షణలో కథ పాఠకుడిని ఉక్కిరి బిక్కిరి చేస్తుంది.

ఈ కథ ముగింపుకు పోయే కొలది రంగప్ప చనిపోతాడేమో అనిపిస్తుంది. రచయిత చంపేస్తాడేమో అనిపిస్తుంది. కానీ రాసాని పాఠకుడి కూడా ఆలోచనని భగ్నం చేస్తారు. రంగప్ప కిందకి దిగుతాడు. జయం పొందుతాడు. భారతానికి మొదటి పేరు జయమే కదా తపస్సు మాను దిగిన రంగప్ప మనసులో నేనిప్పుడు జయించినట్టా?ఓడిపోయినట్టా? అసలు ఎందులో జయించినట్టు ఎందులో ఓడిపోయినట్టు? అనుకుంటూ గర్వంగా నిటారుగా నిలబడి ఉన్న తపస్సుమాను వంక చూడడంతో కథ ముగుస్తుంది .

రాసాని కథల్లో పాత్రలతో పాటు పరిస్థితులు కూడా భాగమై ఉంటాయి. అవాస్తవ పరిస్థితులను ప్రచారం చేయడు. తన అనుభవ పరిధిని అతిక్రమించడు. వ్యవస్థలో నిర్లక్ష్యానికి గురవుతున్న వర్గాలపై గురి పెడతాడు. అంతర్మధనం చెందుతాడు. అదే అంతర్మధనాన్ని కథనంతో పాఠకునిలోకి పంపుతాడు. విధ్వంసం అయిపోయిన జానపద కళారూపాల చివర దశని చూసి వేదనపడతాడు. సాంస్కృతిక వాతావరణాన్ని నిర్లక్ష్యం చేయకుండా, శ్రద్ధగా చూపుతాడు.

ఆయన కథలో మానవ సంబంధాల పతనం స్పష్టంగా కనిపిస్తుంది. ఆ కథలను చదివిన పాఠకుడు కారణాలు అన్వేషిస్తాడు. రాసాని కథల్లో మరో విశేషం శక్తివంతమైన స్త్రీ పాత్రలు. ఆ పాత్రల తాలూకు ఏ క్షణాన్ని రాసాని వ్యర్థం చేయడు. మెరవణి కథలో నరసమ్మ భర్త రంగన్న శవంమీద పడి గుండె లవిసేలా ఏడుస్తుంది. నరసమ్మ చేతికి తన భర్త రంగన్న రక్తం. ఆ రక్తాన్ని ముఖాన్ని పూసుకుంటుంది. 'వరేయ్ ఇప్పుడు చూడండి రా. మీ కులాలు వేరు. మా కులం వేరు. అందరి రక్తం ఒకటే అందరి కులాల్లో ఉండే రక్తము ఒకటే. అది ఎర్రగానే ఉంటాది. దాని వర్ణం ఎరుపు చూడండి” అంటూ మనుషులంతా ఒక్కటే అనే విషయాన్ని ఎర్రగా చెబుతుంది. ఇక్కడ వాచ్యం చేస్తున్నట్టుగా ఉన్నా ఆ పాత్ర తాలూకా స్పందన నిజాయితీని కథకుడు దెబ్బతీయడు. గాలి చెట్టు కథలో ముని లక్ష్మి పురుషాధిక్యాన్ని ప్రశ్నిస్తుంది. గృహహింసను ఎదిరిస్తుంది. అక్షింతల కథలో మాతమ్మ వ్యవస్థపై భాగ్యమ్మ తిరుగుబాటు ప్రకటిస్తుంది. బరియల్ పార్కులో సుబ్బయ్య భార్య కథ నడుపుతుంది.

రాసానికి పాత్రల పట్ల అలసత్వం ఉండదు. అవి నంగి నంగిగా ప్రవర్తించవు. వాటికో ఆత్మను ఇస్తాడు. యాంత్రికమైన చిత్రణ కనిపించదు. తన చుట్టూ ఉన్న సమాజంలో జరిగే కల్లోలాన్ని కథా వస్తువుగా తీసుకుంటాడు.వాటి పరిణామాల్ని, ఫలితాలను వ్యాఖ్యానించకుండానే కథలో భాగం చేస్తాడు. వేట, పయనం, నాలుగో నాటకం కథలు రాసానే రాయగలరు. ఈ కథల్లోని వస్తువు విలక్షణమైనది. ప్రతీకాత్మక శీర్షికల ద్వారా ఈ కథకుడు కథ చెప్పేయడాన్ని గమనించవచ్చు. అదృశ్య శక్తులు మానవత్వం మీద, మానవతా విలువలు మీద జరిపే దాడిని గుర్తించమంటాడు. సామాజిక ఛత్రం ఎందుకు ఛిద్రమవుతుందో రాసాని కథలు చదవడం ద్వారా అర్థం చేసుకోవచ్చు. బరియల్ పార్క్ కథ ప్రత్యేక ఆర్థిక మండళ్లు, వాటి పర్యావసనాలకు వ్యతిరేకంగా రాసిన కథ. ఒక స్త్రీ పాత్ర కథను చెప్పుకుంటూ పోతుంది. ఆ ఆ కంఠ స్వరంలోని వేదన మనల్ని వెంటాడుతుంది. తృతీయ వర్గము అనే కథ గొప్ప శిల్పంతో పాఠకులను ఆకట్టుకుంటుంది.

సామాజిక చలనాలను రాసాని అర్థం చేసుకున్న తీరు ఈ కథలు చదవటం ద్వారా మనకు తెలుస్తుంది. చాలా అద్భుతమైన మాండలిక పదాలను ఆయన కథల్లోంచి జాబితాగా తయారు చేయొచ్చు. ఆ ప్రాంత నుడికారాన్ని, సామెతలను సమయానుకూలంగా వాడడంలో ఈయన నేర్పరి. కథలో చేసే వర్ణనలు ఎంతవరకు ఉండాలో అంతవరకే ఉంటాయి. వాస్తవంగా ఉంటాయి. ఉదాహరణకు వేట కథలో 'కంకర రాళ్లతో బొచ్చు ఊడిపోయిన గజ్జి కుక్క చర్మంలా వికారంగా కనిపించింది రోడ్డు.' అలాగే తపస్సుమాను కథలో 'భారతం మెట్ట నడిబొడ్డున పొడవుగా బ్రహ్మ రాక్షసి కళేబరంలా పడి ఉంది, కొమ్మలు లేని ఒక అశోక వృక్షం.' నాలుగో నాటకం కథలో 'అక్కడి నుంచి ప్రారంభమైన అడవికి నాయకత్వం వహిస్తున్నట్లు ఆకాశంలో నిటారుగా నిలబడి గంభీరంగా కనిపిస్తుంది చింతచెట్టు.... ఇలా ఆ కథ ఏమి ఆశిస్తోంది అనేది అలవోకగా తీసుకురాగలిగే నైపుణ్యం ఈ కథకుడికి అదనపు బలం. కథకు ఏమి ఇవ్వాలో, ఏమి ఇవ్వకూడదో తెలిసిన కథకుడు రాసాని. ఆయనకు కొత్తగా చెప్పాల్సింది ఏముంటుంది?

– డాక్టర్ సుంకర గోపాలయ్య
94926 38547

జీవిత వైచిత్రిని చూపించే 'మాయ'

పుస్తకం

నాలుగు దశాబ్దాలుగా తెలుగు కథా సాహిత్యంలో అలుపెరుగని కృషి చేస్తున్న సాహితీ సవ్యసాచి గంటేడ గౌరునాయుడు మాస్టారు. ఆయన రాసిన పదకొండు కథల సంపుటే 'మాయ'. ఆయన ఈ కథలన్నీ 2008– 22 మధ్య కాలంలో రాసినవి. ఈ పద్నాలుగేళ్లలో తాను చూసిన, మోసిన అనేక సంఘటనల ప్రేరణకు ప్రతిబింబాలుగా ఈ కథలు మనకి కనిపిస్తాయి.

తొంభయ్యో దశకంలో ప్రవేశించిన ప్రపంచీకరణ వల్ల అనేక సంక్షోభాలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా రైతు బతుకు చిన్నాభిన్నం అయ్యింది. వ్యవసాయం మీద ఆధారపడిన కుటుంబాలు వలసబాట పట్టడం, సాగురంగంలో పెనుమార్పులు రావడం, వాణిజ్య పంటల హవా పెరగడం, వ్యవసాయంలో యంత్రాంగం ప్రవేశించడం, పురుగులు మందులు, ఎరువులకు పెట్టుబడి పెరిగిపోవడం, తీరా పండిన పంటని మార్కెట్‌కి తీసుకువెళ్తే తగు ధర లేకపోవడం ... ఈ రచయిత స్వయంగా చూశారు. ఈ పరిణామాల కారణంగా రైతన్నలు వ్యవసాయ కులీలుగాను, కర్మాగారాల్లో కార్మికులలాగానో మారుతున్నారు. ఇలాంటి అనేక సంఘటనలకి 'మాయ' కథల సంపుటి సాక్ష్యంగా నిలుస్తుంది. ఆశ్రమ పాఠశాలల్లో జరిగే అమానవీయమైన సంఘటనలను కూడాఈ కథల్లో గమనించవచ్చు.

'మాయ', 'పొద్దు మునిగిపోయింది', 'అనగనగా ఒక ఊరు', 'అల్పపీడనం' మొదలైన కథలన్నీ నిర్వాసితుల వ్యథార్థ గాథలను వినిపిస్తాయి. ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా ఊరిని, పొలాల్ని కోల్పోయిన గ్రామప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన కొత్త గ్రామాల్లో ఎదురైన చేదు అనుభవమే ఈ 'మాయ' కథ. నాగావళి నదిపై తోటపల్లి బ్యారేజి నిర్మాణం కోసం చుట్టుపక్కల గ్రామాలను ఖాళీ చేపించింది ప్రభుత్వం. నిర్మాణంలో భాగంగానే ఊరిని, పొలాల్ని కోల్పోయిన ప్రజలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి, ఇళ్ళ స్థలాలను చూపించింది. ఇళ్ళను, పొలాల్ని కోల్పోయిన ప్రజలు పట్టణాలకు వచ్చి వ్యసనాలు బారిన పడ్డారు. కథ అంతటికీ మూలం చిరంజీవులు నాయుడు చావు. అక్కడి నుంచి మొదలైంది. కథకులు తన కళ్లారా చూసిన సంఘటనని కథగా మలచి హృదయవిదారకంగా చిత్రించి, కథను నడిపించిన తీరు పాఠకుల్ని కంటతడి పెట్టిస్తుంది. చిరంజీవులు నాయుడు శవాన్ని దహన కార్యక్రమాలు చేపించడానికి కొత్తగా వచ్చిన వాళ్ళకి ఆ ఊర్లో శ్మశానం లేదు. ముంపు భూములకి తగుధర కోసం ధర్నా చేసిన వాళ్ళు నేడు 'మా వూరికి రోడ్డు కావాలనో.. బస్సు కావాలనో.. ఆసుపత్రి కావాలనో అడుగుతారు. ఎవరైనా... కానీ మాకో వల్లకాడు కావాల అని అడుగుతున్నవాళ్ళం చరిత్రలో మనమే మొదటోళ్ళం గావాల' అన్న మాటల్లో నిర్వాసితులుగా మారిన పల్లె ప్రజల రోదన, వేదన కనిపిస్తుంది. ఎవరో ప్రయోజనాల కోసం మరొకరి జీవితాలు బలైపోతున్న వాస్తవ



సంఘటనలు ఈ కథలో కనిపిస్తాయి. ఈ నేపథ్య క్రమంలోనే ప్రాజెక్ట్ నిర్మాణ నిమిత్తం ముంపుకు గురైన గ్రామ ప్రజలు నిరాశ్రయులుగా మారిన దృశ్యానికి నిదర్శనంగా 'పొద్దు మునిగిపోయింది' కథ కనిపిస్తుంది.

పాత్రికేయుడికి ఒక రోజులో ఎదురైన సంఘటనల్ని రికార్డు చేసిన కథే 'మూడు దృశ్యాలు'. ఈ కథలో ప్రధానంగా మూడు సన్నివేశాలు కనిపిస్తాయి. ప్రతి సన్నివేశం కూడా ఒకే అంశంతో ముడిపడి ఉండడం ప్రత్యేకత. వ్యసనాలకు, వినోదాలకు బానిసలైన ప్రజలు ఒక దగ్గర సంపాదించిన భూముల్ని వేరొకరికి అమ్మేయడం ఫలితంగా వలసబాట పట్టడం మొదటిది. డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం ఇచ్చిన పావలా వడ్డీ రుణాల్ని తీసుకొని అధిక వడ్డీకోసం మధ్యవర్తిగా వేరొక చిట్‌ఫండ్ కంపెనీకి ఇచ్చి బలైపోయిన మహిళా కుటుంబం రెండోది. పాఠశాలకి అనుబంధంగా నడిపే వసతి గృహాల్లో పిల్లలకి ఇచ్చే గుడ్లను కొందరు తినకుండా పెద్ద తరగతి విద్యార్థికి యాభై పైసలకు అమ్మగా ఆ గుడ్లు కొన్న విద్యార్థి అవే గుడ్లు బజ్జీ బండివాడికి రూపాయికి అమ్ముతాడట. ఆ బజ్జీలు బండి వాడు అదే గుడ్డును మూడు రూపాయలకి అమ్ముతున్నాడు. ఇలా ఒక దగ్గర సంపాదించిన దానిని మరొక దగ్గర పోగొట్టుకోవడం అనే విషయం మూడు సన్నివేశాల్లోనూ కనిపిస్తుంది.

గిరిజనాభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం అనేక పథకాలు, కార్యాలయాలు నెలకొల్పింది. ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినప్పటికీ, ప్రాథమిక దశ నుంచే అవి దారి మళ్ళింపబడుతున్నప్పుడు అభివృద్ధికి తావులేదు. అలాంటి నేపథ్యంలోనే వెలువడిన కథ 'ఇండియాగాడి టీ.సి.'. ఈ కథలో ఒకరి అవకాశాలను మరొకరు ఎలా ఆపాదించుకుపోతున్నారో తెలియజేస్తారు. ఎవరి అవకాశాలు వాళ్ళు ఉపయోగించుకుంటూ పోతే వ్యక్తి అభివృద్ధి మీదనే సమాజాభివృద్ధి ఆధారపడి ఉంటుందనే విషయాన్ని రచయిత స్పష్టంగా తెలియజేశారు. ఇలాంటి ఇతివృత్తమే 'సంధ్య' కథలో కూడా చోటుచేసుకుంది. అనాథగా ఉన్న అమ్మాయిని ఒక ఉపాధ్యాయుడు బాధ్యత తీసుకొని దీర్ఘకాలంగా మానేసిన అమ్మాయి పేరుతో చదువుకోవడానికి సహాయపడతాడు. ఆ అమ్మాయి బాగా చదువుకొని వార్డెన్ ఆదరణతో ఉద్యోగం సంపాదిస్తుంది. చివరికి అసలు అమ్మాయికి విషయం తెలిసి వచ్చి బెదిరిస్తుంది. సమాజానికి, అవమానాలకు భయపడి అపరాధ భావంతో నలిగిపోయిన మహిళా మనస్తత్వ కోణాన్ని ఈ కథలో చూడవచ్చు.

ప్రపంచీకరణ ప్రభావంతో అనేక చేతివృత్తులు మరుగున పడిపోయాయి. కుల వృత్తులైన కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, మేదర, స్వర్ణకారుల మొదలైనవాళ్ళు గ్రామాల్లో పనులు లేక బతుకు బండిని ఈడ్చడానికి పట్టణాలకు వెళ్ళి వారి వృత్తులు కాకుండా అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్లుగాను, చిన్నచిన్న కర్మాగారాల్లో కార్మికులగానో, సెక్యూరిటీ గార్డులాగానో బతకవలసిన దుస్థితి ఏర్పడింది. ముంపు గ్రామాల రైతులు పల్లెల్లో పనులు లేక పట్టణాల్లో బతకలేక విలవిల్లాడుతున్న దయనీయ స్థితిని 'రైతులేని కాలం' కథలో చూడవచ్చు.

ఈ సంపుటిలో ఉన్న పదకొండు కథల్లో పది కథలు ప్రత్యేక సంచికల కోసం, పత్రికల కోసం రాసినవే! ఒక్క 'పాము' కథ మాత్రమే ఏ పత్రికలోనూ, సంచికల్లోనూ ప్రచురించబడలేదు. పల్లెల్లో రైతన్నల మానసిక సంఘర్షణ, పాలకవర్గాల వాళ్ళ చేతిలో నలిగిపోతున్న ప్రజానీకం వేదన ఈ కథల్లో ప్రతిబింబించారు. ఈ కథలన్నీ గౌరునాయుడు మాస్టారి జ్ఞాపకాలే. బిగబట్టుకున్న బాధల్లోంచి పొంగుకొచ్చిన కథలే. తన కళ్ళ ముందే తను నడయాడిన పల్లెలు జలమయంలో కూరుకుపోవడం, తను ఎరిగిన ముఖాలన్నీ వలసబాట పట్టడం, వ్యవసాయం కనుమరుగవ్వడం వంటివి చూసి కుమిలి కుమిలి ఆయన వేదనను దించుకునేందుకు రాసినవే 'మాయ' కథలు. గౌరునాయుడు స్వయంగా రైతుబిడ్డ. ఆయన ఈ నాలుగు దశాబ్దాలుగా రాసిన కథలన్నీ రైతు జీవితాన్ని, రైతు అనుబంధ వృత్తుల జీవితాన్ని ప్రధాన భూమికగా చేసుకొని రాసినవే. ఇప్పటికే 'ఏటిపాట' (2007), 'ఒక రాత్రి రెండు స్వప్నాలు' (2017) కథా సంపుటుల ద్వారా విశేష పాఠకుల ప్రజాదరణ పొందారు. ఈ 'మాయ' కథలు కూడా చదువరులను ఆలోచింపజేస్తాయి. ప్రశ్నింపజేస్తాయి.

– సారిపల్లి నాగరాజు
80083 70326

ముండ్ల బువ్వ

మాట పొలమారేదాకా
జైలు విధ్వంసం రక్తాన్ని గడ్డకట్టిస్తుంది
లాఠీలు విరిగిన దృశ్యం
చిత్రకారుడి కుంచెలో వూపిరి పీలుస్తుంది
కాళ్లు విరిగిన వొక చక్రాల కుర్చీ
గోడల చెవుల్లో కవిసమ్మేళనం పెడుతుంది
మౌనం దాల్చిన మహాకళాకారుడు
వార్తల గొంతు నులిమేసి
దేశ పురోభివృద్ధి కథలు వినిపిస్తున్నాడు.
నోట్లనీ, వోట్లనీ ఈవిఎంలలో
విత్తులుగా చల్లుకుంటూ
పరాయిదేశాల్లో పురోగతి నాట్లు వేస్తున్నాడు
వనమాలి లేని తోటలోని
వొంటరి పువ్వుపైన
పదేసి తుమ్మెదలు దాడి చేసినా
చప్పట్లు కొట్టే జనాలే కాని
చెంపదెబ్బ కొట్టే ప్రజలు కరువయ్యారు
పెదవి కదిపితే చాలు
పదారు చెరువుల నీళ్ల తాగిస్తున్నారు
గొంతుకలోంచి స్వరం పెగలకముందే
ముళ్లబువ్వ ముద్దని నోట్లో కుక్కుతున్నారు
మరో గాంధీ పుట్టని దేశంలో
పాట కరువైంది మాట బరువైంది.
వైరం చేరువైంది
రాబోయే కారులోనైనా
పిడికిళ్ల పంట కోసుకోకపోతే
ఈ మాగాణి నేల ...
చీకటి ఎడారి పత్రగా మిగిలిపోతుంది

– ఈతకోట సుబ్బారావు
94405 29785

కవితా సంపుటాలకు ఆహ్వానం

కందికొండ రామస్వామి స్మారక పురస్కారం 2022 కోసం 2022లో ముద్రితమైన కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. మూడేసి ప్రతులను జనవరి 31, 2023 లోపు పంపగలరు. బహుమతి పొందిన కవితా సంపుటికి నెల పొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక తరఫున రూ. 10 వేల పురస్కారం, జ్ఞాపిక అందజేస్తాము. మీ ప్రతులు పంపవాల్సిన చిరునామా : అబ్దుల్ వహీద్ ఖాన్, ఇంటి నంబర్ 15– 120/4 /1, రహత్ నాగర్ కాలనీ, నాగర్ కర్నూల్ , 509209. తెలంగాణ.

– పి.వహీద్ ఖాన్, 9441946909
వనపట్ల సుబ్బయ్య, 9492765358

ఈ క్షణాలు

ఇన్ని క్షణాల్ని ముత్యాల్లా వొంపుకుని
చిన్ని కిటికీలోంచి
ప్రపంచాన్ని తెరుచుకుని
సమయాల్ని అలంకరించుకుంటాను
జ్ఞాపకాలు పావురాల్లావాలతాయి
మంచు దృశ్యాలు పరచుకుంటాయి

రాత్రులు వేలాడుతూ
స్వప్న లోకంలో
ఆశల్ని రుచిచూపుతాయి
మౌన క్షేత్రాలు
మనసుని తేలిక పరుస్తాయి
ప్రణాళికలు
మనిషిని క్రమబద్ధీకరిస్తాయి
ఉత్సాహాలు మేల్కొని
ఆరోగ్యమయ ప్రపంచంలో
విజయ తీరాలని చేరుస్తాయి
నిరంతర శ్రమ
పరిశ్రమ ఆత్మ విశ్వాసాన్ని నిలిపి
చెదిరిపోని కలల్ని
దృశ్యాలుగా ఆవిష్కరించి నిలుపుతుంది!

– గవిడి శ్రీనివాస్
70192 78368

ముందు తరం

రాయబడని కావ్యాలెన్నో
పాడలేని గీతాలెన్నో
విస్మృతిలోకి జారిపోయిన
త్యాగమూర్తులెందరో ...

శిక్షలు కోరి తెచ్చుకుంటారు
దేహాలు నలుగుతున్నా సహిస్తారు
బాధల్నీ కష్టాల్నీ కౌగిలించుకుంటారు
లక్ష్యాల్ని గురి తప్పనీయరు
చరిత్రార్థులు వాళ్లు

మొక్కలు నాటారు
సీరు పోసి రక్షణ గోడలు కట్టారు
రెమ్మలు కొమ్మలవ్వడాన్నీ
పూలు కాయలవ్వడాన్నీ చూశారు
వారి గమ్యం తర్వాత తరం
పుణ్యమూర్తులు వాళ్లు

జ్ఞాన సంద్రాన్ని ఈదారు
అనుభవాల పంటను పండించారు
ముందు వెనుకలు చూసి నడిచారు

మానవీయతను ప్రేమించారు
భవిష్యత్తుకు దిక్సూచి వాళ్లు

రాబోవు తరానికి బాటలేసే
ఘన వారసత్వ సంపద అందివ్వడం వాళ్ల పని
వాళ్లు మొనగాళ్లు... వాళ్లు క్రాంతదర్శులు!

– దాట్ల దేవదానం రాజు
94401 05987

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా..
prajasavvadi@gmail.com

గతుకుల రోడ్లతో ప్రాణాలు బలి

- 2021లో 1481 మంది మృతి
- జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ వెల్లడి

న్యూఢిల్లీ : జాతీయ రహదారుల్లో గతుకులు, గుంతలు కారణంగా సంవత్సరానికి 1481 మంది చనిపోయారు. 'భారత్‌లో రోడ్డు ప్రమాదాలు - 2021' పేరిట కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆదివారం ఒక నివేదిక విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం..2021లో వివిధ కారణాలు వల్ల మొత్తం 4,12,432 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వీటిలో 1,53,972 మంది మరణించారు. 3,84,448 మంది గాయపడ్డారు. కాగా 2021లో గతుకుల రోడ్ల కారణంగా 3625 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో 1481 మంది మృతి చెందారు. అలాగే రెడ్ సిగ్నల్ జంప్ చేయడంతో 555 ప్రమాదాలు చోటుచేసుకోగా.. 222 మంది చనిపోయారు. డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడుతుండగా వాహనంపై అదుపు కోల్పోయి 1997 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వీటిలో 1040 మంది మరణించారు. ఇలా అనేక కారణాల వల్ల ఏటా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని నివేదిక పేర్కొంది. వీటి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీలు కలిసికట్టుగా పనిచేయాల్సి ఉందని సూచించింది. రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్ర రోడ్డు రవాణా శాఖ 'ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎమర్జెన్సీ కేర్' అనే పలు దశల ప్రణాళికను రూపొందించినట్లు పేర్కొంది.

సప్దర్ హష్మికి ఘన నివాళి

న్యూఢిల్లీ : ప్రజా కళాకారుడు సప్దర్ హష్మీ..మరణంలేని శ్రమజీవుల కథానాయకుడని ప్రముఖ నటుడు నజిరుద్దీన్ షా ప్రభృతులు కొనియాడారు. హష్మి వర్ధంతి సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని ఝుందాపుర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, ప్రముఖ నటులు నజీరుద్దీన్ షా, రత్నా పాఠక్ షా, సిఐటియు జాతీయ కార్యదర్శి ఎర్ సింధూ తదితరులు పాల్గొని హష్మీకి ఘనంగా నివాళులర్పించారు. శ్రమ జీవుల జీవితాలకు కళారూపమిచ్చి ఎనలేని సాంస్కృతిక సేవ చేసిన ప్రజా సాంస్కృతిక కళా యోధుడైన హష్మీని కార్మికవర్గ చిరకాలం స్మరించుకుంటుందని తెలిపారు. ఝుందాపుర్‌లోనే 1989 జనవరి 1న హష్మీ 'హల్లా బోల్' వీధినాటకాన్ని ప్రదర్శిస్తున్న సమయంలో కాంగ్రెస్ గూండాలు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. తూటాలు దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడిన ఆయన ఆ మరుసటి రోజు జనవరి 2న అమరుడైన సంగతి విదితమే.

రైల్వే బోర్డు ఛైర్మన్‌గా అనిల్ కుమార్

న్యూఢిల్లీ : భారత రైల్వే బోర్డు ముఖ్య కార్య నిర్వహణాధికారి (సిఇఒ)గా, ఛైర్మన్‌గా అనిల్ కుమార్ లహోటి నియమితులయ్యారు. లహోటి భారత రైల్వే సర్వీసెస్ (ఐఆర్ఎస్) 1984 బ్యాచ్‌కు చెందిన అధికారి. ఈ మేరకు కేంద్ర నియామకాల కేబినెట్ కమిటీ ఆదివారం నాడు ఆమోదం తెలిపింది. ఇంతకుముందు లహోటీ రైల్వే బోర్డు సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తించారు. రైల్వే మేనేజ్ మెంట్ సర్వీస్‌లో లెవెల్-17లో తొలుత ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. గ్వాలియర్‌లోని మాధవ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ నుంచి సివిల్ ఇంజినీరింగ్‌లో గోల్డ్‌మెడల్‌తో డిగ్రీ సాధించారు. ఆ తర్వాత ఐఐటి రూర్కీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. 36 ఏళ్ల ఉద్యోగ జీవితంలో సెంట్రల్, నార్త్, నార్త్ సెంట్రల్, వెస్ట్రన్, వెస్ట్ సెంట్రల్ రైల్వేస్‌తోపాటు రైల్వే బోర్డులో వివిధ హోదాల్లో పని చేశారు.

కుప్వారాలో జనరల్ మనోజ్ పాండే పర్యటన

న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్‌లోని కుప్వారా సెక్టార్‌లో చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ మనోజ్ పాండే ఆదివారం పర్యటించారు. నూతన సంవత్సర ప్రారంభం సందర్భంగా ఇక్కడ పర్యటించిన ఆయన నియంత్రణ రేఖ వెంబడి వివిధ ఎత్తైన పర్వత ప్రాంతాల్లో మోహరించిన బలగాలను సందర్శించి శుభాకాంక్షలు తెలియజేశారు. సైనికులు, జాగిలాల నుంచి సైనిక వందనం స్వీకరించిన అనంతరం ఉన్నతాధికారులతో సమావేశమై సరిహద్దు భద్రతపై ఆరా తీశారు.

ఈ ఏడాది సుప్రీంకోర్టులో మరో 9 మంది రిటైర్

న్యూఢిల్లీ : ఈ ఏడాది మరో 9మంది సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రిటైర్ కాబోతున్నారు. ఇప్పటికే ఆరుగురు జడ్జీలు రిటైర్ కాగా, ఈ స్థానాలు ఇంకా భర్తీ కాలేదు. దీంతో కేసుల విచారణ విషయంలో సుప్రీంకోర్టుపై తీవ్ర ఒత్తిడి పెరగనున్నది. దేశవ్యాప్తంగా న్యాయ వ్యవస్థల్లో ఖాళీల సంఖ్య పెద్దఎత్తున ఉండటంతో, కేసుల విచారణ నత్తనడకన సాగుతోంది. సుప్రీంకోర్టు, హైకోర్టు, సబార్డినేట్ కోర్టుల్లో జడ్జీల ఖాళీలు లక్షల సంఖ్యలో పేరుకుపోయాయి. దీంతో మొత్తంగా న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు భారీగా పెరిగిపోయాయి. సుప్రీంకోర్టు, హైకోర్టులలో జడ్జిలను కొలీజియం ఎంపిక చేస్తోంది. కింది స్థాయి కోర్టుల్లో న్యాయమూర్తులు, సిబ్బంది ఎంపిక అంతా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లోని అంశం. కొలీజియంకు వ్యతిరేకంగా మోడీ సర్కార్ గళాన్ని వినిపిస్తోంది. 34 మంది న్యాయమూర్తులు ఉండాల్సిన సుప్రీంకోర్టులో ప్రస్తుతం 28 మంది ఉన్నారు. ఖాళీల భర్తీపై భారత ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ తరుచూ ప్రస్తావిస్తున్నారు. కార్యనిర్వాహక అధికారాలతో న్యాయమూర్తుల ఎంపిక అనేది సరైన విధానం కాదని ఆయన పలు ప్రసంగాల్లో వ్యక్తం చేశారు. చివరి కొలీజియం సమావేశం తర్వాత ఐదుగురు పేర్లను సిఫారసు చేయగా, దీనిపై కేంద్ర న్యాయ శాఖ ఎటూ తేల్చలేదు. ఈ ఏడాది ఏర్పడే ఖాళీల విషయానికొస్తే, జనవరి 4న జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్, మే నెలలో జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ ఎం.ఆర్.షా, జూన్‌లో జస్టిస్ కె.ఎం.జోసెఫ్, జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జులైలో జస్టిస్ కృష్ణమురారి, అక్టోబర్‌లో జస్టిస్ ఎస్.రవీంద్రభట్, డిసెంబర్‌లో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ రిటైర్ కాబోతున్నారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఉండాల్సిన న్యాయమూర్తుల సంఖ్య 34. ఇందులో ఇప్పటికే ఆరు ఖాళీలు ఏర్పడగా, ఈ సంఖ్య 2023లో 15కు చేరుకునే అవకాశముంది. కొలీజియం ద్వారా ఎంపికవుతున్న జడ్జీల జాబితాకు ఆమోదముద్ర వేయకుండా మోడీ సర్కార్ పెండింగ్‌లో ఉంచుతోంది. న్యాయవ్యవస్థపై రాజకీయంగా పైచేయి సాధించేందుకు కేంద్రంలోని పాలకులు ప్రయత్నిస్తున్నారు. సుప్రీంకోర్టు స్వతంత్రను దెబ్బతీసేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని ప్రతిపక్షాల నాయకులు, న్యాయ నిపుణులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెద్దనోట్ల రద్దుపై ఏం చెప్పనుంది?

పెద్ద నోట్లను రద్దు చేస్తూ 2016లో కేంద్రం తీసుకున్న నిర్ణయంపై సుప్రీంకోర్టు నేడు తీర్పు వెలువరించనున్నది. ఆనాడు మోడీ సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై జస్టిస్ ఎస్.ఎ.నజీర్ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం విచారణ జరిపింది. పెద్ద నోట్ల రద్దు నిర్ణయానికి సంబంధించిన రికార్డులను తమకు సమర్పించాలని గత డిసెంబర్ 8న కేంద్రం, ఆర్బీఐని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తీర్పును రిజర్వ్ చేసింది. శీతాకాల సెలవుల అనంతరం సుప్రీం కోర్టు సోమవారం ప్రారంభం కానున్నది.

దేశంలో నిరుద్యోగ విజృంభణ

- డిసెంబర్‌లో 16 నెలల గరిష్టానికి
- నిరుద్యోగ రేటు 8.30 శాతంగా నమోదు
- సిఎంఐఇ సమాచారం

న్యూఢిల్లీ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరుద్యోగ యువత పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. ఆర్థిక మందగమనం, కోవిడ్ నేపథ్యంలో ఉపాధి కరిగిపోతుంటే పాలకులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో నిరుద్యోగ తీవ్రత గతంలో కంటే గణనీయమైన స్థాయిల్లోకి ఎగబాకి రికార్డులు సృష్టిస్తోంది. ప్రతి యేటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామంటూ అధికారంలోకి వచ్చిన మోడీ సర్కార్ ఉన్న ఉద్యోగాలనే కుదించివేస్తుండటంతో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్రం అనుసరిస్తున్న అస్తవ్యస్త విధానాలు, ప్రయివేటీకరణే లక్ష్యంగా ప్రభుత్వ ఆస్థుల అమ్మకం, కార్పొరేట్ల ప్రయోజనాలకే ప్రాధాన్యతనివ్వడం.. వెరసి భారత్‌లో నిరుద్యోగం ఏటికేడూ పెరిగిపోతున్నది. ఈ సారి కూడా భారత్‌లో గతేడాది డిసెంబర్‌లో నిరుద్యోగ రేటు 8.30 శాతానికి పెరిగింది. ఇది 16 నెలల గరిష్టం కావడం గమనార్హం. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమి (సిఎంఐఇ) నుంచి వెలువడిన సమాచారంలో ఈ విషయం వెల్లడైంది. సిఎంఐఇ సమాచారం ప్రకారం.. భారత్‌లో నిరద్యోగ రేటు గతేడాది నవంబర్‌లో 8 శాతంగా ఉన్నది. అయితే, అది డిసెంబర్‌లో 8.30 శాతానికి పెరగడం గమనార్హం. ఇటు పట్టణ ప్రాంతాల్లోనూ నిరుద్యోగ రేటు ఆకాశాన్ని చూసింది. ఇక్కడ నిరుద్యోగ రేటు నవంబర్‌లో 8.96 శాతంగా నమోదు కాగా.. అది డిసెంబర్‌లో 10.09 శాతానికి ఎగబాకింది. అయితే, గ్రామీణ భారతంలో మాత్రం నిరుద్యోగ రేటు స్వల్పంగా తగ్గింది. ఇది నవంబర్‌లో 7.55 శాతం నుంచి డిసెంబర్‌లో 7.44 శాతానికి పడిపోయింది. కాగా, డిసెంబర్‌లో పెరిగిన నిరుద్యోగ రేటు హర్యానాలో అధికంగా 37.4 శాతంగా నమోదైంది. ఆ తర్వాతి స్థానంలో రాజస్థాన్ (28.5 శాతం), ఢిల్లీ (20.8 శాతం) లు ఉన్నాయి.

దేశంలో నానాటికి పెరిగిపోతున్న నిరుద్యోగంపై దేశంలోని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం, రానున్న కరోనా విపత్తు వేళ దేశంలోని లక్షలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను చూపడం మోడీ సర్కారు ముందున్న అతిపెద్ద సవాల్ అని వారు అన్నారు. 2024లో దేశంలో రానున్న సాధారణ ఎన్నికల్లో దీని ప్రభావం పడనున్నదని, బిజెపి ప్రభుత్వానికి ఇది ప్రతికూలంగా మారనున్నదని తెలిపారు.

దేశంలో నిరుద్యోగం విషయంలో ప్రతిపక్షాలు ఇప్పటికే మోడీ సర్కారు తీరును ప్రజల ముందుంచుతున్నాయి. ప్రజల ఉపాధి భద్రత కోసం దేశం నలుమూలాల వామపక్షాలు నిత్యం పోరాడుతూనేవున్నాయి. యువతకు ఉపాధి అవకాలు కల్పించడం, ఉపాధి హామీ పథకాన్ని పట్టిష్టంగా అమల్జేయడం, పట్టణాలు, నగరాల్లోనూ ఉపాధి హామీ పథకాన్ని అమల్జేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రధానంగా వామపక్షాలు డిమాండ్ చేస్తున్న సంగతి విదితమే. మరోవైపు కాంగ్రెస్ అగ్రనేత, వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ ఇప్పటికే తన 'భారత్ జోడో' యాత్ర పేరిట కన్యాకుమరి నుంచి జమ్మూకాశ్మీర్‌లోని శ్రీనగర్ వరకు మార్చ్‌ను నిర్వహించి మరో యాత్రకు సన్నద్ధమవుతున్నారు. ముఖ్యంగా, మోడీ సర్కారు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మోడీ సర్కారును ప్రశ్నిస్తున్నారు. భారత్ దృష్టి కేవలం జిడిపిపై నుంచి ఉద్యోగ, ఉపాధి కల్పనలో వృద్ధికి మారాలని రాహుల్ సూచించారు. ముఖ్యంగా, దేశంలో పెరుగుతున్న అధిక దరలు, నిరుద్యోగం, బిజెపి విభజన రాజకీయాలపై రాహుల్ ఫోకస్ పెడుతూ ముందుకు సాగుతున్నారు. కేంద్రంలోని మోడీ సర్కారు తీరు పట్ల అసంతృప్తితో ఉన్న సాధారణ ప్రజలు, యువత, విద్యార్థులు, నిరుద్యోగుల నుంచి రాహుల్ యాత్రకు మంచి స్పందన లభిస్తున్నది.

వణుకుతున్న ఢిల్లీ

- సగటు కంటే దిగువకు ఉష్ణోగ్రతలు

న్యూఢిల్లీ : శీతాకాల ఉష్ణోగ్రతలు రోజురోజుకీ తగ్గిపోతుండటంతో ఢిల్లీ నగరంతో చలితో వణికిపోతోంది. ఈ సీజన్‌లో కనిష్ట ఉష్ణోగ్రతల సగటు స్థాయిలకంటే తక్కువగా ఆదివారం నాడు 5.5 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఈ విషయాన్ని భారత వాతావరణ విభాగం (ఐఎండి) ఆదివారం వెల్లడించింది. గత శుక్ర, శనివారాల్లో కనీస ఉష్ణోగ్రతలు 10.7 డిగ్రీలు గానూ, 10.2 డిగ్రీలుగానూ నమోదయ్యాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో దృగ్గోచర కాంతి తీక్షణత కూడా వంనకబారి పోంంంది. అంబాల, డెహ్రాడున్, బరేలీ, వారణాసి దృగ్గోచర కాంతి తీక్షణత ఆదివారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో 25 మీటర్లగా ఉంది. అలాగే మొత్తం నగరాన్ని దుప్పిటి కప్పేసినట్టుగా చాలా దట్టంగా మంచు అలుముకుంది.

న్యూఢిల్లీలో స్వల్ప భూకంపం

న్యూఢిల్లీ : దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆదివారం ఉదయం స్వల్ప భూకంపం సంభవించింది. ఢిల్లీ ఎన్‌సిఆర్ ప్రాంతంలో 3.8 కంపన తీవ్రతతో ప్రకంపనలు చోటుచేసుకున్నట్లు జాతీయ భూకంప పరిశోధన కేంద్రం (ఎన్‌సిఎస్) ప్రకటించింది. అయితే ఈ ఘటనలో ఎటువంటి నష్టం సంభవించినట్లు సమాచారం లేదు.

సార్వత్రిక ఎన్నికలకు సెమీ ఫైనల్స్

- 2023లో 9 రాష్ట్రాలకు వరుస ఎన్నికలు

న్యూఢిల్లీ : తెలంగాణ సహా..అనేక రాష్ట్రాల అసెంబ్లీలకు ఈ ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. కర్నాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు..2024 సార్వత్రిక ఎన్నికలకు సెమీ ఫైనల్స్‌గా రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ అసెంబ్లీకు ఫిబ్రవరి-మార్చి మధ్య ఎన్నికలు జరగనున్నాయని సమాచారం. ఈ రాష్ట్రాల ప్రస్తుత అసెంబ్లీ గడువు మార్చితో ముగిసిపోతోంది. 2023లో మొత్తంగా 9 రాష్ట్రాలకు ఎన్నికలు జరగనున్నాయి. అధిక ధరలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం నేపథ్యంలో ప్రస్తుత పాలకులపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. రైతులు, కార్మికులు, యువత, మహిళలు ఆందోళనబాట పడుతున్నారు. 9 రాష్ట్రాల్లో జరిగే ఎన్నికలు 116 లోక్‌సభ స్థానాల పరిధిలో ఉండబోతున్నాయి. దేశంలో నెలకొన్న ఆర్థిక అసమానతలు, మతపరమైన విభజనలు, సామాజిక అస్థిరతలు, రాజకీయ కక్షసాధింపు చర్యలు ఈ ఎన్నికల్ని ప్రభావితం చేస్తాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు 2024 సార్వత్రిక ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకొని మోడీ సర్కార్ అనేక నిర్ణయాలు తీసుకుంటోంది. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్ కూడా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సిద్ధం చేస్తోంది. సెప్టెంబర్‌లో జరిగే జీ-20 సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇవ్వబోతోంది. విదేశీ వ్యవహారాల్లో, అంతర్జాతీయ సంబంధాల్లో తమ విజయంగా ఈ సదస్సును చూపుతూ ప్రచారం చేసుకోవటాన్ని బీజేపీ నాయకులు ఇప్పటికే ప్రారంభించారు. జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికలు, అయోధ్యలో రామ మందిర నిర్మాణం పూర్తిచేయటం ద్వారా హిందువుల ఓట్లను పోలరైజ్ చేయాలనే వ్యూహానికి ప్రధాని మోడీ, అమిత్ షా ద్వయం పదును పెడుతోంది.

యుద్ధం వద్దు..శాంతిపథమే ముద్దు

బ్రెజిల్ నూతన అధ్యక్షులు లూలా ద సిల్వా

నూతన అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరిస్తున్న లూలా

బ్రసిలియా : యుద్ధం మంచిది కాదనీ, శాంతిపథమే ముద్దు అని బ్రెజిల్ నూతన అధ్యక్షులు లూలా ద సిల్వా హితవు పలికారు. బ్రెజిల్ స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఆయన నూతన అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన పదవీ స్వీకార ప్రమాణ కార్యాక్రమం నిర్వహించారు. అంతకు ముందు రష్యా, ఉక్రెయిన్ నేతలు తనతో సమావేశమైన వివరాలను ట్విట్టర్ వేదికగా లూలా పంచుకున్నారు. ఇరు దేశాలూ తక్షణమే యుద్ధానికి ముగింపు పలకాల్సిందిగా రష్యా, ఉక్రెయిన్ దేశాల ప్రతినిధులకు ఇరువురిని కోరినట్లు లూలా తెలిపారు. రష్యా ఫెడరేషన్ కౌన్సిల్ స్పీకర్ వాలెంటినా మత్వియంకో, ఉక్రెయిన్ ఉప ప్రధాని యులియా స్విర్వ్‌డెంకో పదవీస్వీకారోత్సవానికి విచ్చేసిన సందర్భంగా లూలాతో సమావేశమయ్యారు. ఘర్షణలకు ముగింపు పలికేందుకు అన్ని మార్గాలను అన్వేషించాలని, శాంతియుత వాతావరణాన్ని పునరుద్ధరించాలని కోరారు.

ఇ-కామర్స్ కంపెనీల్లో అంతులేని శ్రమదోపిడి

- పని పరిస్థితులు ఘోరం
- కనీస వేతనాలు మృగ్యం
- ఆరోగ్యం దెబ్బతింటే ఇక అంతే
- కార్మికుల గోడు వినేందుకు కంపెనీలు విముఖత
- ఓలా, ఉబర్, అమెజాన్‌లో ప్రమాణాలు సున్నా
- 'ఫెయిర్‌వర్క్ ఇండియా' తాజా నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ : అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఇ-కామర్స్ సంస్థల్లో అంతులేని శ్రమ దోపిడి సాగుతోందని, పని పరిస్థితులు కూడా చాలా ఘోరంగా ఉన్నాయని ఫెయిర్ వర్క్ ఇండియా అనే పరిశోధనా సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదికలో స్పష్టం చేసింది. బహుళజాతి సంస్థలకు, దేశీయ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కేంద్రంలోని మోడీ సర్కార్ వ్యవహరిస్తుండటంతో ఇ-కామర్స్ కంపెనీల ఆగడాలు యేటికేడు శృతిమించుతున్నాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరిట పాలకులు కార్మికుల హక్కులను హరిస్తూ కార్పొరేట్ కంపెనీలకు ఎర్ర తివాచీ పరుస్తుండటంతో అవి మరింతగా శ్రమ దోపిడికి పాల్పడుతున్నాయి. ఓలా, ఉబర్, డుంజో, ఫార్మాఈజీ, అమెజాన్, జొమాటో, ఫ్లిప్‌కార్ట్..తదితర ఇ-కామర్స్ కంపెనీలు కార్మిక చట్టాలేవీ తమకు వర్తించవన్నట్టుగా వ్యవహరిస్తున్నాయి. ఇష్టానుసారం ఉద్యోగుల తొలగింపులు, వేతనాల కోత సర్వసాధారణమై పోయింది. ఈ సంస్థల్లో సరుకుల చేరవేతలో కీలకంగా ఉండే గిగ్ కార్మికులంతా ఒక యూనియన్‌గా ఏర్పడి.. ఆందోళనకు దిగినా ఆ సంస్థలు పట్టించుకునే స్థితిలో లేవు. కార్మికుల ఆందోళన పట్ల కనీసం వాటి స్పందన కూడా తెలపడం లేదు. కనీస వేతనాల్లేవు. సరైన పని పరిస్థితుల్లేని కోట్లాది మంది గిగ్ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా..ప్రభుత్వాలూ పట్టించుకోవటం లేదని 'ఫెయిర్ వర్క్ ఇండియా' తెలిపింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని ఐటీ, పబ్లిక్ పాలసీ విభాగంతో కలిసి సంయుక్తంగా జరిపిన పరిశోధనకు సంబంధించి తాజాగా నివేదికను ఆ సంస్థ విడుదల చేసింది.

పార్లమెంట్‌లో ప్రస్తావన

భారత్‌లో గిగ్ కార్మికుల సంఖ్య ప్రతిఏటా పెరుగుతోంది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఆన్‌లైన్ వేదికలపై, ఇ-కామర్స్ కంపెనీల్లో పనిచేస్తున్నారు. వీరి న్యాయమైన కోరికలు, హక్కుల్ని పరిరక్షించాలని ప్రభుత్వాలు ఆలోచించటం లేదు. కార్మికుల రక్షణ, భద్రతపై విధానపరమైన నిర్ణయాలు చేయటం లేదు. ఏ ఒక్క కార్మికుడికీ కనీసం ఆరోగ్య బీమా వర్తించటం లేదు. కార్మికుడు హఠాత్తుగా తీవ్రమైన ఆరోగ్య సమస్యబారిన పడితే, అతడ్ని ఆదుకునే ఆర్థిక భద్రతా సేవలు లేవు. ఈ-కామర్స్ కంపెనీలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయనే ఆరోపణలున్నాయి. గిగ్ కార్మికుల సమస్యలపై పార్లమెంట్‌లో ప్రతిపక్ష ఎంపీలు ఎన్నోమార్లు ప్రస్తావించారు. హక్కుల ఉల్లంఘన, వివక్ష నెలకొందని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఈ రంగంలో సరైన విధానాల్ని తీసుకురావాలని కోరారు. అయినా కేంద్ర ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేదని 'ఫెయిర్‌వర్క్ ఇండియా' పరిశోధన వెల్లడించింది.

యాజమాన్యాల ఇష్టారాజ్యం

భారత్‌లోని ఇ-కామర్స్ కంపెనీల్లో పనిచేస్తున్న సిబ్బంది, కార్మికులకు న్యాయమైన వేతనాలు దక్కటం లేదు. న్యాయమైన హక్కులు, యాజమాన్య పద్ధతులు, కాంట్రాక్ట్ విధానాల్లేవని, సరైన పని పరిస్థితులు లేవని నివేదిక పేర్కొన్నది. కంపెనీల్లో అమలవుతున్న పని విధానాలతో కార్మికులకు ఎలాంటి లబ్ది చేకూరటం లేదు. బిగ్ బాస్కెట్, ఫ్లిప్‌కార్ట్, ఉర్బాన్ మాత్రమే కనీస వేతనాల అందజేతపై కట్టుబడి ఉన్నామని అధికారికంగా తెలిపాయి. మిగతా కంపెనీలేవీ స్పష్టత ఇవ్వలేదు. కార్మికులు నిరసనగళం వినిపించినా పట్టించుకునే నాథుడే లేడు. తమ గోడు ఎవరికి చెప్పలనేది కూడా కార్మిక సంఘాలకు తెలియని పరిస్థితి. కారణం మూడో పార్టీకి వర్క్ కాంట్రాక్ట్ ఇస్తూ కంపెనీలు తమ సేవల్ని అందజేస్తున్నాయి. కార్మికుల న్యాయపరమైన డిమాండ్లతో తమకు సంబంధం లేదని ఈ-కామర్స్ కంపెనీలు భావిస్తున్నాయి.

అనేక కంపెనీల స్కోర్ జీరో

తమకు కనీస వేతనాలు దక్కటం లేదని కార్మికులు, ఇతర సిబ్బంది, కార్మిక సంఘాలు పదే పదే ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వీటిపై ఇ-కామర్స్ కంపెనీలు బహిరంగంగంగా స్పందించటం లేదు. 12 ఇ-కామర్స్ కంపెనీలపై 'ఫెయిర్‌వర్క్ ఇండియా' అధ్యయనం చేసింది. కార్మికుల కనీస వేతనాలు..తదితర అంశాలను ఆధారంగా స్కోర్ కేటాయించింది. ఇందులో ఓలా, ఉబర్, డుంజో, ఫార్మాఈజీ, అమెజాన్‌లకు 'జీరో' స్కోర్ వచ్చింది. ఉర్బాన్‌కు 7, బిగ్‌బాస్కెట్‌కు 7, ఫ్లిప్‌కార్ట్, స్విగ్గీలకు 5 స్కోర్ దక్కగా, గ్రోసరీ-రెండు, జొమాటో-4, జెప్టో-2, పోర్టర్-1కు లభించింది. స్థానికంగా ఒక గంటకు కనీస వేతనాన్ని పరిగణలోకి తీసుకొని వేతనాలు చెల్లిస్తున్నామని బిగ్ బాస్కెట్, ఫ్లిప్‌కార్ట్, ఉర్బాన్ ఆధారాలు సమర్పించాయి. న్యాయమైన వేతనాలు ఏమేరకు అందుతున్నాయన్న వివరాలు మాత్రం విడుదల చేయటం లేదు.

రూ.లక్షన్నర కోట్లకు చేరిన జిఎస్‌టి వసూళ్లు

- గతేడాదిలో పోలిస్తే 15 శాతం పెరుగుదల

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వసూళ్లు 2022 డిసెంబరులో భారీగా పెరిగాయి. డిసెంబరులో జిఎస్‌టి రెవెన్యూలు దాదాపు రూ.1.5 లక్షల కోట్లకు చేరినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. 2021 డిసెంబరు వసూళ్లతో పోలిస్తే 15 శాతం పెరిగినట్లు పేర్కొంది. 2022 నవంబరు నెలతో పోలిస్తే 2.5 శాతం అధికంగా వసూళ్ల రాబట్టినట్లు తెలిపింది. ఆర్థికశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. 2022 డిసెంబరులో జిఎస్‌టి వసూళ్ల రూ.1,49,507 కోట్లుగా ఉన్నాయి. ఈ వసూళ్లలో సెంట్రల్ జిఎస్‌టి రూ.26,711 కోట్లు కాగా, రాష్ట్ర జిఎస్‌టి రూ.33,357 కోట్లు గానూ, ఇంటిగ్రేటెడ్ జిఎస్‌టి రూ.78,434 కోట్లుగా ఉంది. ఇందులో వస్తువుల దిగుమతిపై వసూలు చేసిన జిఎస్‌టితో రూ.40,263గా ఉంది. సెస్ రూ.11,005 కోట్లు (వస్తువుల దిగుమతిపై సేకరించిన రూ.851 కోట్లతో కలిపి) ఉంది. కాగా జిఎస్‌టి వసూళ్ల రూ.1.4 లక్షల కోట్లకు పైబడి వసూలు కావడం వరుసగా పదో నెల కావడం విశేషం. డిసెంబర్ వసూళ్లలో వస్తువుల దిగుమతుల ద్వారా వచ్చిన ఆదాయం 8 శాతం ఎక్కువ ఉండగా, దేశీయ లావాదేవీల (సేవల దిగుమతితో సహా) వల్ల వచ్చే ఆదాయాలు 18 శాతం ఎక్కువగా ఉన్నాయి.

ఏపిలో 16 శాతం పెరుగుదల

ఆంధ్రప్రదేశ్‌లో గతేడాది డిసెంబర్‌లో జిఎస్‌టి వసూళ్ల రూ.2,532 కోట్లు ఉండగా, అది ఈ ఏడాది 26 శాతం మేర పెరిగి రూ.3,182 కోట్లకు చేరిందని ఆర్థికశాఖ తెలిపింది. ఇక తెలంగాణలో గత ఏడాది రూ.3,760 కోట్లుగా ఉన్న జిఎస్‌టి వసూళ్ల 11 శాతం మేర పెరిగి, రూ.4,178 కోట్లుగా ఉందని వెల్లడించింది.

విద్యార్థుల యూనిఫామ్ అలవెన్సుకూ మీనమేషాలు

- హర్యానా, యుపీలో బిజెపి ప్రభుత్వాల తీరు
- మూడు నెలల్లో ముగియనున్న విద్యా సంవత్సరం

న్యూఢిల్లీ : రెండు నెలల క్రితమే చలికాలం ప్రారంభమైనా.. హర్యానా, ఉత్తరప్రదేశ్‌లలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్‌ల భత్యాలు ఇంకా అందలేదు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ సొంత జేబుల నుంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోపక్క రానున్న మూడు నెలల్లోనే విద్యా సంవత్సరం ముగియనున్నది. దీంతో ఈ రెండు రాష్ట్రాల్లోని బిజెపి ప్రభుత్వాల అలసత్వ వైఖరితో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ భత్యం కోసం వారు ఎదురు చూస్తున్నారు.

హర్యానాలోని ఫరీదాబాద్ జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శీతాకాలపు యూనిఫామ్ భత్యాలు ఇంకా అందలేదు. శీతాకాలపు యూనిఫామ్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 1 నుండి 5 తరగతులకు చెందిన ప్రతి విద్యార్థికి రూ. 800, ఆరు నుండి 8వ తరగతి చదువుతున్న వారికి రూ. 1000 అందజేస్తుంది. జిల్లాలోని ప్రభుత్వ ఆధ్వర్యంలోని 230 ప్రాథమిక, 50 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపుగా 85 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు.

ప్రతి విద్యార్థి బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం భృతిని నేరుగా జమ చేస్తుంది. ప్రభుత్వ సమాచారం ప్రకారం సాంకేతిక కారణాల వలన, అవసరమైన షరతులను పాటించకపోవడం వలన 20 శాతం మంది విద్యార్థులకు ఖాతాలు లేవు. భృతి విడుదలలో జాప్యాన్ని హర్యానా ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు చతర్‌సింగ్ ఖండించారు. ఇక్కడి విద్యార్థులలో చాలా మంది వలసకార్మికుల చిన్నారులున్నారనీ, వారి వద్ద ఆధార్‌కార్డుల కోసం స్థానిక చిరునామా లేదనీ, ఫలితంగా వారు బ్యాంకు ఖాతాను తెరవలేకపోయారని తెలిపారు.

కాగా, భత్యం విడుదలలో జాప్యం వెనక కారణం తనకు తెలియదని జిల్లా విద్యాశాఖాధికారి మునీశ్ చౌదరి తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన చెప్పారు. 2022-23 అకడమిక్ సెషన్ మరో మూడు నెలల తర్వాత ముగుస్తుందనీ, ఇప్పటికీ విద్యార్థులకు భత్యం అందలేదని, ఈ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చాలా మంది ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందినవారని డిపార్ట్‌మెంట్‌కు చెందిన మరొక అధికారి తెలిపారు.

ఈ ఒక్క జిల్లా మాత్రమే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుండి 8వ తరగతులలో చేరిన 16 లక్షల మందికి పైగా విద్యార్థులకు ఈ అకడమిక్ సెషన్‌లో యూనిఫామ్ అలవెన్స్ ఇంకా రాలేదు. చలికాలం నుంచి విద్యార్థులను రక్షించేందుకు చాలా మంది తమ జేబులో నుంచి యూనిఫాం కొనుగోలు చేయగా.. భత్యం విడుదల చేయడంతో జాప్యం కారణంగా తల్లిదండ్రులు పాఠశాలల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చింది.

ఈ పరిస్థితి ఒక్క హర్యానాలోనే కాదు.. యుపిలోని ప్రభుత్వ పాఠశాలలోనూ ఇదే తీరు కనబడింది. యూపీలోని చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల యూనిఫామ్‌లు కొనుగోలు చేయడానికి అలవెన్సులు కూడా అందలేదని వెల్లడైంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. యూపీలోని 1.35 లక్షల ప్రాథమిక పాఠశాలల్లో (1 నుంచి 8వ తరగతి వరకు) 1.91 కోట్ల మంది విద్యార్థులున్నారు. వీరిలో కేవలం 90 వేల మంది విద్యార్థుల తల్లిదండ్రులకు యూనిఫాం, స్కూల్ బ్యాగులు కొనుగోలు చేసేందుకు నిధులు అందాయి. యూనిఫాం కొనుగోలుకు విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు రూ. 1100 వినియోగిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభంలో ప్రకటించింది. అయితే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఈ బదిలీ కోసం ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విద్యార్థుకు అందాల్సిన నిధులను విడుదల చేయాలని సామాజికవేత్తలు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన ఎలా ఉన్నాయో తెలుసుకోవడానికి ఈ రెండు రాష్ట్రాల పరిస్థితులే ప్రత్యక్ష ఉదాహరణ అని వారు తెలిపారు.

అనుపమానం.. ఆమె నృత్య ప్రావీణ్యం

ఆంధ్రాలో పుట్టిపెరిగిన ఆమె కూచిపూడి కళాకారిణిగా, వెంపటి చినసత్యం శిష్యురాలిగా సుప్రసిద్ధురాలు. ప్రపంచ దేశాల్లో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. దేశవ్యాప్తంగా కూచిపూడిని వ్యాప్తి చేయడమే లక్ష్యంగా కేరళలో డ్యాన్స్ అకాడెమీ నెలకొల్పారు. అక్కడే 2 వేల మందికి పైగా విద్యార్థులకు కూచిపూడి శిక్షణ ఇస్తూ నాట్యానికే తన జీవితాన్ని అంకితం చేశారు. ఆమె పేరు అనుపమా మోహన్. వయసు 64 ఏళ్లు. ఈ వయసులో ఆరు నెలల క్రితం రెండు మోకాళ్లకు చికిత్స తీసుకుని కూడా నాట్యంపై ఉన్న మక్కువతో ఇటీవల విజయవాడలో నిర్వహించిన అమరావతి నృత్యోత్సవం 2022లో నాట్య ప్రదర్శన ఇచ్చారు. ఆ సందర్భంగా తన జీవిత విశేషాలను ముచ్చటించారు.

నెల్లూరులో 1958 మే 2న కందికట్టు వెంకయ్య నాయుడు, వనజాక్షమ్మ దంపతులకు అనుపమ జన్మించారు. కుటుంబంలో ఎవరూ నృత్యకారులు లేరు. అయినా నాలుగేళ్ల వయసు నుంచే నృత్యంపై మక్కువ పెంచుకున్నారు. ఆమె ఆసక్తిని గ్రహించిన తల్లిదండ్రులు నెల్లూరులో ప్రముఖ నృత్యకళాకారుడు కోట సుబ్రమణ్య శాస్త్రి దగ్గర శిక్షణ కోసం పంపించారు. అక్కడ నాలుగేళ్లు శిక్షణ తీసుకున్న ఆమె ఆ తరువాత మద్రాస్ కూచిపూడి డ్యాన్స్ అకాడెమీలో చేరారు. ఆ అకాడెమీ నిర్వాహకులు డాక్టర్ వెంపటి చినసత్యం. అలా కూచిపూడి ఆచార్యుని దగ్గర శిక్షణ ప్రారంభించిన అనుపమ చాలా తక్కువ సమయంలోనే చినసత్యం ప్రియ శిష్యుల్లో ఒకరైపోయారు. మంజుభార్గవి, శోభానాయుడు, హేమమాలిని తదితర ప్రముఖ నృత్యకారులతో పాటు అనేక నృత్యరూపకాలు ప్రదర్శించారు. చినసత్యం రూపొందించిన అనేక బాలీల్లో స్త్రీ పాత్రల్లో శోభానాయుడు తరువాత అనుపమ నర్తించేవారు. 'శ్రీకృష్ణ పారిజాత' నృత్య ప్రదర్శనలో నారద పాత్ర పోషించిన ఆమె ఆ పాత్రలో ఎంతలా లీనమయ్యారంటే చాలాకాలంపాటు నారద పేరుతోనే ఆమెను పిలిచేవారు. ఇంకా 'శ్రీనివాస కళ్యాణం' రూపకంలో ఎరుకల స్త్రీగా, 'శాకుంతలం'లో అనసూయ పాత్రలో వందల ప్రదర్శనలు ఇచ్చారు.

చిత్ర పరిశ్రమలోనూ..

క్లాసికల్ డ్యాన్సర్‌గా పలు చలనచిత్రాల్లోనూ ఆమె నటించారు. ఎన్‌టిఆర్ నటించిన ఆరాధన చిత్రంలో నాట్యగురువుగా ఆమెను చూడవచ్చు. అలనాటి మలయాళ చిత్రాల్లో హీరోయిన్‌గా కనిపించారు. అప్పుడే మలయాళ సినిమా దర్శకులు, నిర్మాత, రచయిత అయిన మోహన్‌ను ప్రేమించి పెళ్లిచేసుకున్నారు. ఇరుకుటుంబాల నుంచి తీవ్ర వ్యతిరేక వచ్చినప్పటికీ వాటిని అధిగమించామని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పెళ్లి తరువాత నటనకు స్వస్తి పలికిన ఆమె ఆ తరువాత తన కలల ప్రాజెక్టు డ్యాన్స్ అకాడెమీ స్థాపనకై అవిశ్రాంత కృషిచేశారు. 'సత్యాంజలి అకాడెమీ ఆఫ్ కూచిపూడి' పేరుతో కేరళలో మొట్టమొదటి డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌ని ప్రారంభించారు. అకాడెమీ ద్వారా అనేక వర్క్‌షాపులు నిర్వహించారు. ప్రతి ఏడాది నృత్యోత్సవాలు చేస్తున్నారు. కూచిపూడితో పాటు వివిధ రకాల భారతీయ శాస్త్రీయ నృత్య రూపాలైన నాట్య కౌస్తుభ్ నృత్యోత్సవ్, గురు స్మరణాంజలి ఉత్సవాలను ప్రతి ఏడాది ఏప్రిల్, జులై నెలలో నిర్వహిస్తున్నారు.

సినిమా అవకాశాలపై మాట్లాడుతూ.. 'నటనపై ఆసక్తి ఉన్నా పెళ్లి తరువాత చాలా అవకాశాలు కోల్పోయాను. తెలుగులో లెజెండరీ దర్శకులు కె. విశ్వనాధ్ తెరకెక్కించిన 'శంకరాభరణం', తమిళ దర్శకులు భారతీరాజా రూపొందించిన 'ఇరుకుం పోతు రైలు'లో కీలకపాత్రలు చేసే అవకాశం కోల్పోయాను. నా జీవితంలో ఈ రెండు విషయాలు ఎప్పుడూ ఇబ్బంది పెడుతుంటాయి' అంటున్నారు.

ఇటలీ, ఈజిప్టు, పారిస్, వంటి దేశాల్లో ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా నృత ్యప్రదర్శనలిచ్చిన అనుపమ ఎన్నో పురస్కారాలు, ప్రశంసలు అందుకున్నారు. మృణాళిని సారాభాయ్ అవార్డు, యువనర్తకి పురస్కార అవార్డు, కూచిపూడి ఆర్ట్ అకాడెమీ నుంచి నాట్యవిశారద బిరుదు అందుకున్న ఆమె గురువాయూర్ క్షేత్ర కళాపురస్కార అవార్డు గ్రహీత కూడా. ఆరు పదుల వయసు దాటినా ఆరోగ్య సమస్యలున్నా ఎంతో ఉత్సాహంగా కళాప్రదర్శన ఇచ్చిన అనుపమ మోహన్ కళాతృష్ణను అభినందించని వారు లేరు.

రేగిపండ్లు ఆరోగ్యానికి మేలు

శీతాకాలంలో లభించే పండ్లలో రేగిపండు ఒకటి. ప్రస్తుతం చలికాలం కావడంతో ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. ఈ సీజన్‌లో రేగిపండ్లు తినటం వల్ల శరీరానికి ఎంతో మేలు కలుగుతుంది. రోగనిరోధకశక్తి పెంచటంలో రేగిపండ్లు బాగా దోహదపడతాయి. వీటిల్లో విటమిన్ సి, ఏ పొటాషియం పుష్కలంగా ఉంటాయి.

- చలికాలంలో జలుబు, దగ్గు లాంటి సమస్యలు సహజం. అయితే ఈ కాలంలో ఈ సమస్యల నుండి రక్షించడానికి సహాయపడతాయి. నిద్ర లేమి సమస్యతో బాధపడే వారు ఈ పండ్లను తింటే నిద్ర లేమి సమస్య నుండి బయట పడొచ్చు. రేగిపండ్లను తొక్కతో పాటూ తినడం వల్ల కాలేయానికి చాలా మంచిది.
- రేగుపళ్లు చెడు కొవ్వును కరిగించడమే కాకుండా ఆకలిని పెంచుతాయి. శరీరానికి తక్షణ శక్తిని ఇవ్వగల రేగు పండ్లను బలహీనంగా ఉన్న వారు తినడం చాలా మంచిది. జీర్ణశక్తిని మెరుగుపరచడంలో కూడా రేగిపండ్లు కీలక పాత్రనే పోషిస్తాయి. కడుపు ఉబ్బరం తగ్గుతుంది. రక్తప్రసరణ సరిగ్గా జరగడం కోసం, రక్తం ఉత్పత్తిని పెంచటంలో సహాయపడతాయి. చలికాలంలో శరీరం డీహైడ్రేట్ కాకుండా కాపాడతాయి.
- ఎండిన రేగు పండ్లలో కాల్షియం, పాస్పరస్ ఎక్కువగా ఉంటాయి. ఎముకలు దృఢంగా ఉండేందుకు ఇవి ఉపయోగపడతాయి. ఎముకల్ని బలహీన పరిచే ఆర్థరైటిస్ సమస్యతో ఎవరైనా బాధపడుతుంటే, వారికి ఈ పండ్లు తినడం మంచిది. రేగు పండ్లు పొటాషియం, పాస్పరస్, మాంగనీస్, ఐరన్, జింక్ పోషకాల్ని కలిగివుంటాయి. ఈ చిన్న రేగు పండ్లలో ఉండే మినరల్స్ మన గుండె ఆరోగ్యంగా ఉండటానికి చాలా అవసరం.
- రేగిపండ్లలో ఒత్తిడిని తగ్గించే గుణాలు ఎక్కువగా ఉంటాయి. మానసిక బాధ నుంచి బయటపడేస్తాయి. అంతే కాకుండా చర్మ ఆరోగ్యానికి దోహదపడతాయి. చర్మంపై ముడతలను పోగొట్టి, యవ్వనంగా కనిపించేలా చేస్తాయి.

సాధు జంతువుల స్నేహం

సాధు జంతువులను ప్రేమిద్దాం
దగ్గర చేర్చుకుని ఆదరిద్దాం
వాటితో కలిసి మెలిసి జీవిద్దాం
ఆనందంగా గడిపేద్దాం

కుక్కతో చెలిమి కట్టేద్దాం
విశ్వాసాన్ని నేర్చుకుందాం
కోడిని ఎంచక్కా పెంచుదాం
సమయపాలన పాటిద్దాం

పశువుతో ప్రేమగా మెలుగుదాం
కష్టసుఖాలను తెలుసుకుందాం
గాడిద సహాయాన్ని పొందుదాం
బద్దకాన్ని ఇక తరిమికొట్టేద్దాం

పిల్లిని నిమురుతు చేరదీద్దాం
ఆడుతు పాడుతు వుందాం
చల్ చల్ గుర్రం ఎక్కేద్దాం
పరిసరాలను చుట్టొద్దాం

మే మే మేకతొ కలిసుందాం
చురుకుదనంగా కదులుదాం
గొర్రెతొ ఏకమై నడిచేద్దాం
క్రమశిక్షణతో బతికేద్దాం

కుందేలుతో మాలిమి చేద్దాం
గెలుపుకు మార్గం కనుగొందాం
ఆవు పాలను గటగట తాగి
ఆరోగ్యాన్ని పొందేద్దాం!

సాధు జీవులను దరికి చేర్చుదాం
లక్షణాలను తెలుసుకుందాం
ఆదర్శంగా తీసుకుందాం
పదుగురిలో మంచిగా వుందాం

- నరెద్దుల రాజారెడ్డి
96660 16636

దేని నీడ ఏది?



చిన్నారులూ, ఇక్కడ కొన్ని పక్షులు రకరకాల ఫోజుల్లో ఉన్నాయి. ఎదురుగా వాటి నీడలు ఉన్నాయి. దేని నీడ ఏదో కనిపెట్టి జతచేయండి.

నేను గీసిన బొమ్మ

వి. కావ్య, 7 వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యాదమరి, చిత్తూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మా చిరునామా
రంగవల్లి
ప్రజాశక్తి దినపత్రిక , ప్రజాశక్తి భవనం
అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501,
గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి :
jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

రంగవల్లి

13 చుక్కలు 7 వచ్చే వరకు
(మధ్య చుక్క)

భార్గవి తెల్లాకుల,
కృష్ణాజిల్లా.

23 చుక్కలు 12 వచ్చేవరకు
(మధ్య చుక్క)

టి. గౌరమ్మ, రాయఘడ,
రాణిగూడ ఫామ్.

సహజ కథలే తెరకు బలం

కొత్త ఏడాదికి వచ్చేశాం. కాసిన్ని హిట్‌లు, మెండైన ఫట్‌లు, ఫలించని ప్రయోగాలు, రుచించని రీమేక్‌లు ఇత్యాది ఇతివృత్తాలతో గతేడాదంతా తెలుగు చలనచిత్రసీమ తడిసిముద్దయిపోయింది. మన సినిమాల్లో దార్శనికత, సృజనాత్మకత, సామాజికత గురించి చర్చ నడుస్తూనే ఉంది. వినోదం అందిస్తూ.. విజ్ఞానం పెంచుతూ.. మన చుట్టూ ఉన్న జీవితాల నుంచే కథలు పుట్టుకు తెలుగు పరిశ్రమకు చాలా అరుదైన సంగతి అయిపోయింది! చాలా భాగం కమర్షియల్ మయం. భారీ బడ్జెట్‌లు, భారీ తారాగణం వెరసి కొత్తదనం లేని పాత చింతకాయ కథలనే నాలుగు పాటలు, ఆరు ఫైట్లతో నడిపించేస్తున్నారు.

పర భాషా ఇండస్ట్రీల నుంచి అరువు తెచ్చుకున్న కథలకు కూడా తెలుగుదనం ఉట్టిపడే సొగసులద్దామని చెప్పి మూలకథను చెడగొట్టేస్తున్నారు. ఇండస్ట్రీలో పెద్ద హీరోలందరూ కంటెంట్ ఉన్న సినిమాల నుంచి ఎప్పుడో దూరమైపోయారు. కమర్షియల్ హంగులతో.. భారీ సెట్టింగ్‌లతో.. ఏడాదికో, రెండేళ్లకో ఒకటి, రెండు సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. హిట్, ఫట్ ఈ రెండు విషయాలే సినిమాకు కొలమానంగా భావిస్తున్నారు.

ఏడాది మొత్తంగా చూస్తే పదీ పన్నెండుకు మించి పెద్ద హీరోల చిత్రాలు రావు. మిగిలిన రోజులన్నీ చిన్న సినిమాలు, చిన్న హీరోలవే.. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలు రావాల్సింది కూడా ఇక్కడినుంచే. అయితే ఇప్పుడు మన ఇండస్ట్రీలో కనపడుతున్న అతిపెద్ద కొరత కూడా ఇదే. తెలుగు చిత్రసీమ పాన్ ఇండియా క్రేజులో కొట్టుకుపోతోంది. పెద్ద హీరోలతో పాటు చిన్నా, చితకా హీరోలు కూడా ఆ ఒరవడిలోనే మునిగితేలుతున్నారు. ఇప్పుడు ఇండస్ట్రీలో కొత్త దర్శకులు పుట్టుకొచ్చారు. విభిన్న కథలతో రచయితలు సిద్ధమవుతున్నారు. అయితే వీరంతా పాత కథలను, పాన్ ఇండియా క్రేజును దృష్టిలో పెట్టుకునే సినిమాలు తీస్తున్నారు. యువతరం ఉర్రూతలూగాలంటే హార్ట్‌బీట్ పెంచే పాటలు, రక్తం మరిగే ఫైట్లే కాదు.. వారి ఆలోచనలను, ఆశలను మరింత పదునుపెట్టే అంశాలు తెరపై కనిపించాలి.

అనుసరించాల్సిన ఒరవడి

గతేడాది సినిమాల్లో మంచి ఫీల్‌గుడ్ చిత్రాలుగా తెరకెక్కిన సీతారామం, ఒకే ఒక్క జీవితం, 18 పేజేస్, గుర్తుందా శీతాకాలం, థాంక్యూ చిత్రాలను ఒకసారి పరిశీలిస్తే ప్రేమ కథా చిత్రంగా తెరకెక్కిన సీతారామం మినహాయించి తక్కిన చిత్రాలన్నీ మన చుట్టూ ఉన్న జీవితాల నుండే పుట్టిన కథలుగా అనిపిస్తాయి. కథలో మూలం అక్కడి నుంచే మొదలవుతుంది. ప్రేక్షకులు సినిమాకు కనెక్ట్ కావాలంటే కావాల్సింది అదే.. హీరో, హీరోయిన్లను చూసి సినిమాకు వచ్చే ప్రేక్షకులున్నట్లే కథ, కథనం నచ్చి సినిమాలను ప్రేమించేవారు కూడా ఉంటారు. కానీ ఆ తరహా చిత్రాలను తెరకెక్కించడంలో మన ఇండస్ట్రీ ఎప్పటినుంచో వెనకపడింది.

సీతారామం

18 పేజేస్,

ప్రయోగాలు.. జీవన దృశ్యాలు

సినిమాను ఓ సామాజిక బాధ్యతగా తెరకెక్కించే దర్శక నిర్మాతలు మనకు చాలా అరుదుగా ఉన్నారు. కోలీవుడ్, మాలీవుడ్ ఇండస్ట్రీలతో పోల్చినప్పుడు ఆ వెలితి చాలా స్పష్టంగా కనిపిస్తుంది. రెండు విభిన్న కులాలు, మతాల మధ్య జరిగే సంఘటనలు, సంఘర్షణలే సామాజిక అంశాలు కావు. రెండు విభిన్న వ్యక్తిత్వాలతో ఒకే ప్రయాణం చేసే భార్యభర్తల మధ్య కూడా అనేక సంఘర్షణలు, సర్దుబాట్లు ఉంటాయి. వారిచుట్టూ పెనవేసుకున్న ఎన్నో జీవితాల నుంచి బోలెడు కథలు పుట్టుకొస్తాయని గతేడాది తెరపైకి వచ్చిన అనేక తమిళ, మలయాళ చిత్రాలు నిరూపించాయి. ఐశ్వర్య లక్ష్మి , నవీన్‌చంద్ర ప్రధాన తారాగణంగా గృహహింస ఎదుర్కొనే మహిళ ఇతివృత్తంతో తెరకెక్కిన 'అమ్ము', మైనర్లపై లైంగిక వేధింపుల ఇతివృత్తంతో సాయి పల్లవి కీలకపాత్రలో నటించిన 'గార్గి', 'అమ్ము' చిత్రం చూసినప్పుడు కథనం నడిపించిన విధానంలో ఏదో వెలితి అనుభవించిన ప్రేక్షకులు సంతోషపడేలా ఏడాది చివర్లో వచ్చిన 'జయ జయ జయ హే' చిత్రాలు వంటివెన్నో ఆ ఇండస్ట్రీలలో ఎప్పుడూ వస్తుంటాయి. చాలా తక్కువ బడ్జెట్‌లో ఎంతో విషయమున్న ఆ చిత్రాలు ఎప్పటికీ ఎవర్‌గ్రీన్‌గా నిలుస్తాయి.

'జయ జయ జయ హే

చిన్న సినిమా అడ్డా..

ఒకప్పుడు చిన్న సినిమాలకు థియేటర్లు దొరకడం లేదని, కొనేందుకు బయ్యర్లు దొరకడం లేదన్న వాదన ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారింది. కరోనా తెచ్చిన అతిపెద్ద మార్పుల్లో ఓటీటీ రంగం ఒకటి. థియేటర్లు తెరుచుకున్న తరువాత ఈ ఓటీటీలన్నీ మూతబడతాయని చాలామంది భావించారు. కానీ ఓటీటీలు కొత్త ఆరంభానికి నాంది పలుకుతాయని ఎంతోమంది వాదించారు. అనుకున్నట్లుగానే ఇప్పుడు చిన్నా పెద్దా సినిమాలన్నీ ఓటీటీల ముందు క్యూ కడుతున్నాయి. నేరుగా ఓటీటీలో విడుదలయ్యే చిత్రాలతో ఇప్పుడు ఆ రంగం నిండిపోయింది. ఈ వేదిక మీదే ఎన్నో కంటెంట్ సినిమాలు ప్రేక్షకులకు దగ్గరవుతున్నాయి.

అమ్ము

గుర్తుందా శీతాకాలం

థియేటర్లు తెరుచుకున్నా.. పెద్ద హీరో నటించినా ప్రేక్షకులు ఆదరించడం లేదని తలలు పట్టుకుంటున్న సినీపెద్దలు.. లోపం ఎక్కడుందో గ్రహించి ఈ ఏడాదైనా మంచి విషయమున్న సినిమాలను రూపొందించాలి.

ఇక కొత్తగా..!

- మెరుగ్గా క్రికెటర్ల వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్
- ఎన్‌సిఎ, ఐపిఎల్ ఫ్రాంఛైజీల ఉమ్మడి పర్యవేక్షణ
- బిసిసిఐ సమీక్షా సమావేశంలో నిర్ణయం

భారత క్రికెట్‌ను నిలకడగా వేధిస్తోన్న గాయాల బెడద, ఫిట్‌నెస్ సమస్యలకు చెక్ పెట్టేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఎట్టకేలకు నడుం బిగించింది. స్వదేశంలో ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ సహా ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాదికి పక్కా ప్రణాళిక రూపొందించింది. ఆటగాళ్ల గాయాల బెడదను నియంత్రించేందుకు ఎన్‌సీఏ, ఐపీఎల్ ఫ్రాంచైజీలు కలిసి పని చేయనుండగా.. వన్డే వరల్డ్‌కప్ కోసం 20 మందితో కూడిన ఆటగాళ్లను బోర్డు ఖరారు చేసినట్టు సమాచారం.

ముంబయి :

దిద్దుబాటు చర్యలు

2022 ఏడాది భారత క్రికెట్‌కు చేదుగా గడిచింది. చిరస్మరణీయ విజయాల కంటే చేదు పరాజయాలే ఎక్కువగా పలకరించాయి. 2023 వన్డే వరల్డ్‌కప్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న బిసిసిఐ.. కొత్త ఏడాదిని సమీక్షా సమావేశంతో మొదలుపెట్టింది. దక్షిణాఫ్రికాలో టెస్టు సిరీస్ ఓటమి, ఇంగ్లాండ్ చేతిలో ఐదో టెస్టు పరాజయం, ఐసిసి టీ20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్లోనే నిష్క్రమణ, తాజాగా బంగ్లాదేశ్ చేతిలో వన్డే సిరీస్‌లో పరాభవం బిసిసిఐ సమీక్షా సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చాయి. చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, కెప్టెన్ రోహిత్ శర్మ, చీఫ్ సెలక్టర్ చేతన్ శర్మలు సమీక్షా సమావేశానికి హాజరయ్యారు. బిసిసిఐ అధ్యక్షుడు రోజర్ బిన్ని, కార్యదర్శి జై షాలతో పాటు ఎన్‌సిఎ చీఫ్ వివిఎస్ లక్ష్మణ్ సైతం ఈ భేటిలో ఉన్నారు.

ఫిట్‌నెస్ నిలిపేదెలా?

సమీక్షా సమావేశంలో పరాజయాలకు దారితీసిన కారణాలతో పాటు క్రికెటర్ల ఫిట్‌నెస్, గాయాల బెడదపై ప్రధానంగా చర్చ నడిచినట్టు తెలిసింది. కెప్టెన్ రోహిత్ శర్మ సహా కీలక ఆటగాళ్లు గాయాలతో జట్టుకు దూరమయ్యారు. జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజాలు ఐసిసి టీ20 ప్రపంచకప్‌కు దూరమయ్యారు. దీపక్ చాహర్ గత ఏడాది అంతా ఆటకు దూరంగా ఉన్నాడు. బిసిసిఐ వార్షిక కాంట్రాక్టు కలిగిన క్రికెటర్లు గాయాల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోడ్‌మ్యాప్‌పై చర్చ నడిచింది. జాతీయ జట్టుకు ప్రాతినిథ్యం వహించే ఆటగాడు 100 శాతం ఫిట్‌నెస్‌తో ఉండాలని జట్టు మేనేజ్‌మెంట్ కోరుకుంటున్నట్టు కెప్టెన్ రోహిత్ తెలిపాడు.

ఎన్‌సిఎ, ఫ్రాంఛైజీలు జట్టుగా..! :

2023 భారత క్రికెట్‌కు అత్యంత కీలకం. కాసులు కురిపించే ఐపిఎల్‌తో పాటు జాతీయ జట్టు చరిష్మా పెంచేందుకు వన్డే వరల్డ్‌కప్ ముందున్నాయి. ఐపిఎల్‌లో ఆడుతూ కీలక ఆటగాళ్లు గాయపడి, వరల్డ్‌కప్‌కు దూరమైతే బోర్డుపై తీవ్ర విమర్శలు వచ్చే ప్రమాదం ఉంది. ఆతిథ్య జట్టుగా ప్రథమ ప్రాధాన్య ఆటగాళ్లనే బరిలోకి దింపేందుకు బోర్డు నిశ్చయంగా ఉంది. అందుకే ఈ సీజన్ నుంచి భారత క్రికెటర్ల ఫిట్‌నెస్, పని భారం పర్యవేక్షణను జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సిఎ), ఐపిఎల్ ఫ్రాంఛైజీలు ఉమ్మడిగా చూసుకోనున్నాయి. ఈ మేరకు బీసీసీఐ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. జాతీయ జట్టు ప్రణాళికల్లో ఉన్న ఆటగాళ్లకు ఫిట్‌నెస్, వర్క్‌లోడ్ రోడ్‌మ్యాప్‌ను ఎన్‌సీఏ ప్రత్యేకంగా సిద్ధం చేసింది. ఇప్పుడు ఈ ప్రక్రియలో ఐపిఎల్ ఫ్రాంఛైజీలు సైతం భాగస్వామ్యం కానున్నాయి.

కొత్తగా డెక్సా స్కాన్స్ :

జాతీయ జట్టులో చోటు దక్కించుకునేందుకు సత్తా చాటితే చాలదు, ఫిట్‌నెస్ సైతం ఉండాలని విరాట్ కోహ్లి నాయకత్వంలో ఓ నిబంధన ప్రవేశపెట్టారు. ఆ రూల్ కారణంగా కొందరు జాతీయ జట్టుకు ఎంపికైనా ఫిట్‌నెస్ పరీక్షలో విఫలమై జట్టుకు దూరమయ్యారు. జట్టు ఎంపిక ప్రక్రియలో ప్రామాణిక ఫిట్‌నెస్ పరీక్ష యోయో టెస్టును మళ్లీ ప్రవేశపెట్టనున్నారు. యోయో టెస్టుకు అదనంగా డెక్సా స్కాన్స్‌ను కొత్తగా తీసుకురానున్నారు.

యోయో టెస్టులో ఆటగాడి ఫిజికల్ ఫిట్‌నెస్ స్థాయికి తేల్చుతారు. డెక్సా స్కాన్ టెస్టులో ఆటగాడి సైంటిఫిక్ ఫిట్‌నెస్ స్థాయిని నిర్ధారిస్తారు. డెక్సా స్కాన్‌తో.. ఎముక ఆరోగ్యం, కండరాల ఆరోగ్యం, శరీరంలో కొవ్వు శాత, ఎముక-కండరాల నిష్పత్తి వంటి వివరాలు తెలుస్తాయి. ఈ నివేదికతో గాయాల బారిన పడే ప్రమాదం ఉన్న క్రికెటర్లను గుర్తించి, రిహాబిలిటేషన్‌లో ఉంచుతారు.

దేశవాళీ అనుభవం

జాతీయ జట్టు ఎంపికకు తొలినాళ్లలో ఐపిఎల్ ప్రదర్శన పెద్దగా పరిగణనలోకి తీసుకునేవారు కాదు. కానీ ఇటీవల కాలంలో ఓ ఐపిఎల్ సీజన్‌లో రాణిస్తే జాతీయ జట్టులో చోటు సంపాదించటం తేలిక అవుతుంది. అదే దేశవాళీ సీజన్‌లో మెరిసిన ఆటగాళ్లకు అంత ప్రాముఖ్యత దక్కటం లేదు. ఐపిఎల్ మెరుపులతో జాతీయ జట్టులోకి వచ్చిన క్రికెటర్లు ఫిట్‌నెస్‌ను సైతం వేగంగా కోల్పోతున్నారు. కొంతమంది క్రికెటర్లు దేశవాళీ క్రికెట్ కంటే ఐపిఎల్ సీజన్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు సైతం బోర్డు దృష్టిలో వచ్చింది. దీంతో జాతీయ జట్టు ఎంపిక కొలమానాల్లో విశేష దేశవాళీ సర్క్యూట్ అనుభవం తప్పనిసరి చేసింది బోర్డు. ఏదో ఒక ఫార్మాట్ కాకుండా, అన్ని ఫార్మాట్లలోనూ దేశవాళీ క్రికెట్‌లో ఆడాలని నిబంధనలు పెట్టింది. దేశవాళీ క్రికెట్ ప్రాముఖ్యతను మరింత పెంచేందుకు ఈ ప్రతిపాదన దోహదం చేయగలదు.

20 మందితో ప్రాబబుల్స్?! :

బిసిసిఐ సమీక్షా సమావేశంలో 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ రోడ్‌మ్యాప్‌పై చర్చించినట్టు బోర్డు స్పష్టంగా తెలిపింది. కానీ, ఈ సమావేశంలో మరో కీలక నిర్ణయం సైతం తీసుకున్నట్టు బోర్డు వర్గాలు చెబుతున్నాయి. స్వదేశంలో జరుగనున్న మెగా ఈవెంట్‌కు 20 మందితో కూడిన ఉత్తమ ఆటగాళ్లను ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఈ ఏడాది వన్డే ఫార్మాట్‌లో ఈ 20 మంది ఆటగాళ్లను రొటేషన్ పద్ధతిలో ఆడించే ఆలోచన కనిపిస్తోంది. జట్టులో ప్రతి స్థానానికి అంతే మెరుగైన ప్రత్యామ్నాయం అందుబాటులో ఉంచేందుకు బీసీసీఐ ఈ ఆలోచనను తెరపైకి తీసుకొచ్చినట్టు తెలుస్తోంది.

సిఏసి తొలి భేటీ!

బిసిసిఐ కొత్తగా నియమించిన క్రికెట్ సలహా కమిటీ (సిఎసి) సమావేశమైంది. అశోక మల్హోత్రా, జతిన్ పరంజిపె, సులక్షణ నాయక్‌లతో కూడిన క్రికెట్ సలహా కమిటీ తొలి సమావేశం నిర్వహించింది. నూతన సెలక్షన్ కమిటీ సభ్యులను ఈ కమిటీ ఎంపిక చేయనుంది. వెంకటేశ్ ప్రసాద్, శ్రీధరన్ శరత్, ముకుంద్ పర్మార్, సలీల్ అంకోలా, రీతిందర్ సింగ్ సోధి, శివ సుందర్ దాస్, రిజ్వాన్ శంశద్‌లు సెలక్షన్ కమిటీ రేసులో ముందున్నారు. క్రికెట్ సలహా కమిటీ త్వరలోనే సీనియర్ సెలక్షన్ కమిటీ ఎంపిక చేయనుంది. న్యూజిలాండ్‌తో వైట్‌బాల్ సిరీస్‌కు నూతన సెలక్షన్ కమిటీ జట్లను ఎంపిక చేసే అవకాశం కనిపిస్తోంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68